శుక్రవారం 18 ఏప్రిల్ 2025

https://www.telugudesam.org

# చైతన్యరథం





సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ

- గవర్నర్ ఆమోదంతో గెజిట్ విడుదల

3



### కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి

## ప్రతిష్టాత్మక గుర్తింపు

- డబ్ల్యుఈఎఫ్ గ్లోబల్ యంగ్ లీడర్స్ జాబితాలో చోటు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అభినందనలు
- దార్శనికుడు చంద్రబాబు ఆలోచనలే నాకు స్ఫూర్తి: రామ్మోహన్‌నాయుడు

2

## మే 2, సాయంత్రం 4 గంటలకు!

- ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు
- అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవం
- సచివాలయం వెనుక బహిరంగ సభ వేదిక
- 5 లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు
- మొత్తం 4 హెలిప్యాడ్‌లు సిద్ధం

2





## పాస్టర్లకు సీఎం చంద్రబాబు శుభవార్త

- గౌరవ వేతనాలకు రూ.30 కోట్లు విడుదల
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా తీపి కబురు
- గత మే నుంచి నవంబర్ వరకు 7 నెలల కాలానికి మొత్తం చెల్లింపు
- త్వరలోనే పాస్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమ

2



## ప్రత్యేక మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంపు

- గౌరవ వేతనం రూ.45000కు పెంపు, రవాణా ఖర్చులకు మరో రూ.5000
- 2019 ఏప్రిల్ 1వ తేదీ నుండి వర్తింపు
- మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

3

## విద్యుత్ ఛార్జీలపై వైసీపీ అసత్య ప్రచారం

- జగన్ హయాంలో పెంచిన భారాన్నే నేటికీ ప్రజలు భరిస్తున్నారు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఛార్జీలు పెంచలేదు
- సాక్షిలో విద్యుత్ బిల్లులపై తప్పుడు కథనాలు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి స్పష్టీకరణ
- ఉయ్యూరులో 33/11 కే వీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

5



## బొత్స వ్యాఖ్యలు అజ్ఞానానికి నిదర్శనం

- దిగ్గజ కంపెనీల చూపు రాష్ట్రం వైపు
- పరిశ్రమలు రావడం లేదని వైసీపీ విషప్రచారం
- కమీషన్ల కోసం కంపెనీలను తరిమేసిన చరిత్ర జగన్‌ది
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

- వివరాలు 7 లో..

## స్థానిక సంస్థలకు నిధులివ్వండి

- పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వండి
- 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు వినతి

- వివరాలు 7 లో..

## రైతులకు అండగా ప్రభుత్వం



- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు
- గోతాల సరఫరాకు చర్యలు
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

8

### శ్రీవారి భక్తులకు

## టీటీడీ సేవలు భేష్

- అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తి
- పనితీరు మెరుగైందని అభినందన
- వసతిగదులపై పర్యవేక్షణ ఉండాలని సూచన

6

## సవాల్ చేసి తోకముడిచిన భూమన

- గోశాల సందర్శనకు, చర్చకు సిద్ధమని బీరాలు
- పోలీసులు అనుమతించినా వెళ్లకుండా డ్రామాలు
- చెప్పిన ప్రకారం అనుచరులు లేకుండానే గోశాల వద్దకు కూటమి ఎమ్మెల్యేలు
- వేలాదిమందితో వెళతానంటూ భూమన మొండిపట్టు
- హౌస్ అరెస్ట్ చేశారంటూ రోడ్డుపై పడుకుని అబద్ధాలు

4

# మే 2, సాయంత్రం 4 గంటలకు!

- ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు
- అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవం
- సచివాలయం వెనుక బహిరంగ సభ వేదిక
- 5 లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు
- మొత్తం 4 హెలిప్యాడ్‌లు సిద్ధం



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి నిర్మాణాల పునః ప్రారంభానికి రానున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారయింది. మే 2న సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇందుకోసం సచివాలయం వెనక బహిరంగసభ వేదికను ప్రభుత్వం ఎంపిక చేసింది. అక్కడి నుంచే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధాని నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె విజయానంద్ సమీక్షనిర్వహించారు. ప్రధాని సభకు సుమారు 5లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికవద్ద 50వేల మంది కూర్చునేలా, లక్ష మంది రోడ్ల వెంబడి నిలబడి ప్రధానికి స్వాగతం పలికేందుకు, అలాగే మిగతా వారు వివిధ ప్రాంతాల్లో ఉండి వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా..

వీఐపీలతో పాటు ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు 9 రహదార్లను గుర్తించామని, ఆయా రహదార్లలో ఎక్కడా ట్రాఫిక్ సమస్య కలగకుండా తగిన తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ విజయానంద్ అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు, ప్రకాశం సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. వేసవి దృష్ట్యా ప్రధాని పర్యటనకు వచ్చే ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులెవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందని సీఎస్ స్పష్టం చేశారు.

### అట్టహాసంగా ఏర్పాట్లు

అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పీఎం మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాన వేదికను తూర్పు అభిముఖంగా ఉండేలా రెడీ చేస్తున్నారు. వర్షం పడినా కూడా ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయనున్నారు. ఈ నెల 28వ తేదీ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. వీఐపీ పార్కింగ్‌కు 10 ఎకరాలు, వేదికల కోసం 28 ఎకరాలు కేటాయించారు.


### ప్రముఖుల కోసం 4 హెలిప్యాడ్లు

ప్రధానితో పాటు ఇతర ప్రముఖుల కోసం 4 హెలిప్యాడ్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు. సచివాలయం ఎదుట ముఖ్యమంత్రి ఉపయోగించే మూడు హెలిప్యాడ్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరొకటి సిద్ధం చేయాలని నిర్ణయించారు. రైతుల లే అవుట్‌లో నాలుగో హెలిప్యాడ్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. సభకు వచ్చేవారి కోసం 40 ఎకరాల్లో టెంట్లు వేయనున్నారు. ఎకరాకు 6 వేలు చొప్పున మొత్తం 2.40 లక్షల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

హెలిప్యాడ్ నుంచి వేదిక వరకు ఇరు వైపులా రైతులు, మహిళలు నిలబడి ప్రధాని మోదీకి పూలు చల్లుతూ స్వాగతం పలకనున్నారు. సచివాలయం ఎదుట ఉన్న హెలిప్యాడ్లు, సభాప్రాంగణాన్ని ఇప్పటికే అధికారులు పరిశీలించారు. రహదారి మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్తు తీగలను, చెట్లను వేరే చోటుకు మార్చనున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చుట్టూ ఉన్న రాజధాని రహదారులను తాత్కాలికంగా సిద్ధం చేయనున్నారు.

---

## పాస్టర్లకు సీఎం చంద్రబాబు శుభవార్త



- గౌరవ వేతనాలకు రూ. 30 కోట్లు విడుదల
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా తీపి కబురు
- గత మే నుంచి నవంబర్ వరకు 7 నెలల కాలానికి మొత్తం చెల్లింపు
- త్వరలోనే పాస్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమ

అమరావతి (చైతన్యరథం): గుడ్ ఫ్రైడే ముందు రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాస్టర్లకు తీపి కబురు చెబుతూ నెలకు రూ.5వేలు చొప్పున గౌరవ వేతనం విడుదలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాస్టర్లకు గౌరవవేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,427 మంది పాస్టర్లకు 2024 మే నుంచి నవంబర్ వరకు 7 నెలల కాలానికి రూ.30 కోట్లు విడుదల చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తామని యువనేత లోకేష్ సైతం హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం హామీని అమలు చేసింది.

కాగా రాష్ట్రంలోని పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపు కోసం రూ. 30 కోట్లు బడ్జెట్‌ను మైనారిటీ సంక్షేమ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలోని 8427 మంది పాస్టర్లకు త్వరలోనే క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వారి వారి బ్యాంక్ అకౌంట్లకు గౌరవ వేతనాన్ని జమ చేస్తామని తెలిపారు. గుడ్ ఫ్రైడే ముందు రోజున ప్రభుత్వం పెండింగ్లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లింపు కోసం రూ.30 కోట్లు మొత్తాన్ని విడుదల చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

---

### కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి

## ప్రతిష్టాత్మక గుర్తింపు

- డబ్ల్యుఈఎఫ్ గ్లోబల్ యంగ్ లీడర్స్ జాబితాలో చోటు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అభినందనలు
- దార్శనికుడు చంద్రబాబు ఆలోచనలే నాకు స్ఫూర్తి: రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ (చైతన్యరథం): కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఈఎఫ్) రూపొందించిన గ్లోబల్ యంగ్ లీడర్స్ -2025 జాబితాలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి చోటు దక్కింది. ప్రపంచ వ్యాప్తంగా తమరంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువనాయకులను వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎంపిక చేస్తుంది. ఈసారి భారత్ నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. పరిపాలన, ప్రజాసేవలకు యంగ్‌గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్ నాయుడిని గుర్తించారు. దీనిపై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమైన, ప్రభావితమైన నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. నిజాయితీ, నూతన ఆలోచనలతో ప్రజలకు సేవ చేసే బాధ్యతను ఈ గుర్తింపు మరింత పెంచిందన్నారు. ఇది భారత యువ గొంతుకలకు దక్కిన గుర్తింపు అన్నారు. ప్రధాని మోదీనాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రజాసేవలో ఎర్రన్నాయుడు, చంద్రబాబును చూస్తూ ఎదిగాను.. వారి ఆలోచనలు, ముందు చూపు, నిబద్ధత, చిత్తశుద్ధి తనకు స్ఫూర్తిదాయకమన్నారు.

2014లో 26 ఏళ్ల అతి చిన్న వయసులో పార్లమెంట్ సభ్యుల్లో ఒకరిగా ఉన్న రామ్మోహన్‌నాయుడు.. 2024 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన నాయకత్వంలో పౌర విమానయాన శాఖ కొత్త పుంతలు తొక్కుతోంది. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కల్పన నుంచి.. దేశంలోని వివిధ మారుమూల ప్రాంతాలకు వైమానిక సేవలను అభివృద్ధి చేసేందుకు ఆయన ఎంతో కృషి చేస్తున్నారు.

### తెలుగువారికి గర్వకారణం: చంద్రబాబు

యంగ్ గ్లోబల్ లీడర్ గా ఎంపికైన రామ్మోహన్ నాయుడుకి సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు దేశానికి, ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమన్నారు. ప్రజాసేవలో రామ్మోహన్ అంకితభావం.. యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. మన రాష్ట్రంతోపాటు దేశ పురోగతికి కృషి చేస్తూ.. ప్రపంచ వేదికపై భారత స్వరాన్ని వినిపిస్తూ.. ఆయన నిరంతరం విజయాలను సాధించాలని కోరుకొంటున్నట్లు ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

### ఉన్నత శిఖరాలకు ఎదగాలి: మంత్రి లోకేష్

యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఎంపిక కావడం ఏపీకి, భారత్‌కు గర్వకారణమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నుంచి రామ్మోహన్‌నాయుడు ప్రేరణ పొందడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# ప్రత్యేక మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంపు

- గౌరవ వేతనం రూ.45000కు పెంపు, రవాణా ఖర్చులకు మరో రూ.5000
- 2019 ఏప్రిల్ 1వ తేదీ నుండి వర్తింపు
- మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (క్లాస్-2)ల గౌరవ వేతనాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ మేరకు గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రత్యేక మెజిస్ట్రేట్లకు పెంచిన గౌరవ వేతనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.30000 నుంచి రూ. 45000కు పెంచినట్లు అలాగే రవాణా ఖర్చుల నిమిత్తం మరో రూ.5000 మొత్తాన్ని నెలకు చెల్లించనున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే గౌరవ వేతనం పెంపుదల 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వర్తించేటట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయశాఖ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

**- మంత్రి అచ్చెన్నాయుడు**



టెక్కలి (చైతన్యరథం): ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం లింగాల వలస గ్రామంలో తెలుగు దేశంపార్టీ నూతన కార్యాలయాన్ని గురవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. అభివృద్ధి,సంక్షేమానికి తొలిప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ

## - గవర్నర్ ఆమోదంతో గెజిట్ విడుదల

అమరావతి (చైతన్యరథం): ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆర్డినెన్స్ జారీచేసింది ఎస్సీ వర్గీకరణతో విద్య, ఉద్యోగ సమాన అవకాశాలకు మార్గం సుగమమైంది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన గెజిట్‌ను న్యాయశాఖ జారీ చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులిచ్చారు. తాజాగా.. ఈ నెల 16వ తేదీన వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలన్నింటికీ విద్య, ఉద్యోగాల్లో సమాన, న్యాయమైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా.. ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియలో అతి ముఖ్యమైన ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, మాదిగ, మాల ఉపకులాలను ఏబీసీ కేటగిరీలుగా విభజించారు. రెల్లి ఉపకులాలకు 1 శాతం, మాదిగ ఉపకులాలకు 6.5 శాతం, మాల ఉపకులాలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం ఈ గెజిట్ జారీ చేసింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఈ రిజర్వేషన్లను వర్తింపచేసేలా ప్రభుత్వం ఈ ఆర్డినెన్సును జారీ చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణకు మంత్రివర్గం నిర్ణయించింది. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది.



ప్రకాశం జిల్లా కనిగిరిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎస్సీ సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి గత నెలలో ఏక సభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాల్లో ఎస్సీ వర్గీకరణపై విచారణ చేసి నివేదికను అందించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్ విధానం, ఎస్సీల్లో ఉపవర్గాల ఆర్థిక స్వావలంబన, తదితర అంశాలపై ఏక సభ్య కమిషన్ అధ్యయనం చేసింది రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఉపకులాల నుంచి విజ్ఞప్తులు, అభ్యర్ధనలు స్వీకరించి, అభిప్రాయ సేకరణ జరిపారు.


ఈ నివేదిక ఆధరంగా ఎస్సీ వర్గీకరణ అంశపై కేబినెట్‌లో చర్చించి ఆమోదించారు. తాజాగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

### సీఎస్‌ను కలిసిన కృష్ణమాదిగ

మరోపైపు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ గురువారం సచివాలయంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నందుకు సీఎస్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీఎంవో కార్యాలయంలో..సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర, సీఎం సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్నతోపాటు ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ ఏవీ రాజమౌళితో మంద కృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి కావడానికి సహకరించినందుకు వారికి మంద కృష్ణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.

# పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్రంలో 3400 మంది పేదలకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్
- గురుకులాల్లో నీట్ శిక్షణ కేంద్రాలు 10కి పెంపు
- పీ 4 ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం
- మంత్రి డోలా స్పష్టీకరణ
- విశాఖలో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ చేసిన మంత్రి



విశాఖపట్నం(చైతన్యరథం): పేదలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు విశాఖపట్నంలోని ద్వారకా నగర్‌లో ఉచిత డీఎస్సీ శిక్షణా కేంద్రం, మధురవాడలో కళాశాల ఎస్సీ వసతి గృహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావుతో కలిసి మంత్రి డోలా సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్సీ శిక్షణ కేంద్రంలో క్లాస్ రూమ్‌లో విద్యార్థులతో పాటు కూర్చుని సిబ్బంది బోధనా తీరును మంత్రి పరిశీలించారు.అభ్యర్థుల సమస్యలు, శిక్షణ కేంద్రంలో అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ... పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 3,400మంది పేద విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తున్నాం.రాష్ట్రంలో గురుకులాల్లో నీట్ శిక్షణ కేంద్రాలు ప్రస్తుతం మూడే ఉన్నాయి వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనతో 3 నుంచి 10కి పెంచుతున్నాం. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టులు త్వరలో భర్తీ చేస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల కాలంలోనే రూ.300 కోట్లతో కొత్త ఎస్సీ హాస్టళ్ల నిర్మాణం, గురుకులాలు,వసతి గృహాలకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంక్షేమ వసతి గృహాలు,గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం పెడతామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని, అందు కోసం తెలుగువారి పర్వదినమైన ఉగాది నాడు పీ 4కి శ్రీకారం చుట్టారు. పీ 4 ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని మంత్రి అన్నారు. అనంతరం విశాఖ ఎంవీపీ కాలనీలోని సాంఘిక సంక్షేమ జిల్లా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

### గురుకుల బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

విశాఖ జిల్లా మేఘాద్రిగడ్డలో గురుకుల బాలికల పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో కలిసి మంత్రి డోలా ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగిన తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి సమస్యను మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకొచ్చారు.

నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మంత్రి సూచించారు. ఇంటర్‌లో 950కి పైగా మార్కులు సాధించిన పలు వురు విద్యార్థినిలను మంత్రి అభినందించారు. విద్యా ర్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, కష్ట పడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని మంత్రి డోలా ఉద్బోధించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కాస్మోటిక్ కిట్స్ అందజేస్తామన్నారు. పేదింటి బిడ్డలు ఇంజనీర్లు,డాక్టర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయం అని చెప్పారు. పేద విద్యార్థుల కోసం నీట్ శిక్షణ కేంద్రాల్ని 10కి పెంచామన్నారు.

# సవాల్ చేసి తోకముడిచిన భూమన

- గోశాల సందర్శనకు, చర్చకు సిద్ధమని బీరాలు
- పోలీసులు అనుమతించినా వెళ్లకుండా డ్రామాలు
- చెప్పిన ప్రకారం అనుచరులు లేకుండానే గోశాల వద్దకు కూటమి ఎమ్మెల్యేలు
- వేలాదిమందితో వెళతానంటూ భూమన మొండిపట్టు
- హౌస్ అరెస్ట్ చేశారంటూ రోడ్డుపై పడుకుని అబద్ధాలు



తిరుపతి (చైతన్యరథం): తిరుమలలో రాజకీయాలు చేసినవారందరూ నష్టపోయారు. భారీ మూల్యం కూడా చెల్లించారని చరిత్ర చెబుతున్న వాస్తవం. ఇవేవీ పట్టని వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాత్రం గురువారం తిరుపతిలో హై డ్రామా నడిపించారు. టీటీడీ గోశాల పరిశీలనకు వస్తానని, చర్చకు సిద్ధమని సవాల్ చేసిన ఆయన.. చివరికి తోక ముడిచి అడ్డంగా దొరికిపోయారు. ఛాలెంజ్ చేసిన ప్రకారం అనుచరులు లేకుండా కూటమి ఎమ్మెల్యేలు గోశాలకు చేరుకున్నారు. అయితే ఒక్క పోలీసు అడ్డు చెప్పకపోయినా హౌస్ అరెస్ట్ అంటూ రోడ్డెక్కి భూమన డ్రామాలకు దిగి, గోశాలకు వెళ్లకుండా తనకు అసలు సిగ్గనేది లేదని నిరూపించుకున్నాడు.

తిరుపతి గోశాలలో గడచిన 3 నెలల్లోనే 100 మేర గోమాతలు మృత్యువాత పడ్డాయంటూ తిరుపతి మాజీ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి రాజకీయ రచ్చకు తెర తీశారు. రాజకీయ దురుద్దేశాలతో భూమన కల్పిత కథలను ప్రచారం చేస్తున్నారంటూ ప్రభుత్వంతో పాటుగా టీటీడీ పాలక మండలి కూడా ప్రతిస్పందించింది. అప్పటికీ ఆగని భూమన టీటీడీ, ప్రభుత్వ ప్రకటనలపైనా మరోమారు విమర్శలు చేశారు. పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వాన్ని అసహనానికి గురి చేశాయి. ఈ క్రమంలో భూమనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. దమ్ముంటే ఈ విషయంపై చర్చకు సిద్ధమా? అంటూ ఆయన సవాల్ విసిరారు. తప్పుడు ఆరోపణలు చేసినందుకు సంయమనం పాటించాల్సిన భూమన.. పల్లా సవాల్ కు తాను సిద్ధమేనని ప్రకటించి చివరికి తోక ముడిచారు.

## అనుచరులు లేకుండానే వచ్చిన కూటమి ఎమ్మెల్యేలు

ఈ క్రమంలో గురువారం చర్చ కోసం కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తిరుపతిలోని గోశాలకు చేరుకున్నారు. కేవలం నేతలు, వారి సెక్యూరిటీ గార్డులు మాత్రమే వచ్చారు. భూమన సవాల్ చేసినట్లుగా టీడీపీ నేతలు మాత్రం అనుచరులు లేకుండా అక్కడకు వచ్చారు. గోశాల వద్దకు కూటమి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులతో పాటు తితిదే సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి తదితరులు వెళ్లారు. గోశాలను పరిశీలించడానికి భూమన వస్తాడేమో అని ఎదురు చూశారు. ఎంతకూ రాకపోవడంతో అక్కడి నుంచే భూమన కరుణాకర్‌రెడ్డికి వారు ఫోన్ చేశారు. అసత్య ఆరోపణలు చేయడం కాదని.. క్షేత్రస్థాయికి రావాలని కోరారు. పోలీసులు సూచనల మేరకు ఐదుగురితో రావాలని ఆయనను కోరారు. ఎమ్మెల్యేల ఫోన్ నేపథ్యంలో గోశాలకు వస్తానని భూమన తెలిపారు.

## రోడ్డుపై పడుకుని భూమన డ్రామాలు

పోలీసులు కూడా భూమన వెళ్లేందుకు అభ్యంతరం చెప్పలేదు. పోలీసులు తనని అడ్డుకుంటారనే ధీమాతో ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి.. అందుకు విరుద్ధంగా జరగటంతో కంగుతిని కొత్త నాటకం ప్రారంభించారు. తన నివాసం నుంచి సుమారు 2,000 మందిని వెంటబెట్టుకొని గోశాలకు బయలుదేరారు. దీంతో ఆయన ఊహించిన్నట్లే పోలీసులు వారిని అడ్డుకొన్నారు. గోశాలకు గుంపులుగా వెళ్లొద్దని పోలీసులు సూచించారు. కార్యకర్తలతో కాకుండా హడావుడి లేకుండా గోశాలను సందర్శించి, మీడియాతో మాట్లాడి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వెళ్లిపోవాలని చెప్పారు. భూమన కరుణాకర్ రెడ్డి, మరో ముగ్గురు ముఖ్య నేతలను మాత్రమే అనుమతిస్తామని చెప్పి అడ్డుకున్నారు. వెంటనే భూమన కరుణాకర్ రెడ్డి రోడ్‌పై పడుకొని డ్రామా మొదలుపెట్టేశారు. తనను గృహ నిర్బంధం చేశారని కల్లబొల్లి మాటలు మొదలెట్టారు. మాజీ మంత్రి రోజా ఆయన పక్కనే కూర్చొని పోలీసులపై విరుచుకు పడ్డారు. గోశాలకు రమ్మనని ఫోన్లు చేసి పోలీసులతో అడ్డుకుంటారా? మమ్మల్ని ఎదుర్కోలేకనే పోలీసులతో అడ్డుకుంటున్నారని రోజా ఆరోపించారు. ఈ ఆరోపణలపై తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్పందించారు. ఎవరినీ గృహ నిర్బంధం చేయలేదని ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా గోశాలను ఏ పార్టీ నేతలైనా సందర్శించవచ్చునని ఆయన అన్నారు.

## భూమనవి తప్పుడు ఆరోపణలు..

ఎస్వీ గోశాలపై వైకాపా నేతల ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని కూటమి ఎమ్మెల్యేలు, నేతలు విమర్శించారు. వైసీపీ హయాంలో టీటీడీలో ఎన్నో అక్రమాలు జరిగాయన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు పవిత్రమైన తిరుమలను అపవిత్రం చేస్తూ, వ్యాపార కేంద్రంగా మార్చారన్నారు. గోవుల మృతిపై అసత్య ప్రచారం, తప్పుడు ఆరోపణలు చేసి తీరా చర్చకు రమ్మంటే భయపడి తోక ముడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదేమైనా గోశాలలో ఆవులు చనిపోతుంటే అందుకు ఎవరైనా బాధపడతారు. కానీ మనుషులతో శవ రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, ఆవులతో కూడా శవరాజకీయాలు చేస్తుండటమే దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

# మహిళల రక్షణకు 'కలిసికట్టుగా' కార్యక్రమం

**- విశాఖలో హోంమంత్రి అనిత శ్రీకారం**



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో మహిళ రక్షణకు 'కలసికట్టుగా' కార్యక్రమం నిర్వహిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖలో మహిళ రక్షణకు కలిసికట్టుగా కార్యక్రమానికి హోంమంత్రి అనిత శ్రీకారం చుట్టారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో విశాఖ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హోంమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖ సీపీ శంఖ బ్రాత బాగ్చి, ఏయూ వీసీ రాజశేఖర్, పోలీస్ అధికారులు పాల్గొనగా, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ప్రేమ అనే ముసుగులో యువత బలైపోతున్నారన్నారు. ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలు అవుతున్నారు. ఏయూలో చదవడం అనేది ప్రతిఒక్కరికి కల. రాజకీయాలకు తావు లేకుండా ఏయూకి వీసీగా రాజశేఖర్ ను నియమించారు. మహిళ రక్షణకు కలిసికట్టుగా కార్యక్రమానికి విశాఖలో శ్రీకారం చుట్టాము. వంద సంవత్సరాల జీవితం కోసం యువత ఆలోచన చేయాలి. దయచేసి భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దు. స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలి. మన కోసం నిరంతరం కష్టపడుతున్న తల్లిదండ్రులు కోసం ఒక్క క్షణం ఆలోచన చేయాలి. పోక్సో కేసులలో 20 శాతం నిందితులు 18 సంవత్సరాలు లోపే వారే ఉంటున్నారు. 80 శాతం మంది నిందితులు 23 సంవత్సరాలు లోపు వారే ఉంటున్నారు. చట్టాలపై అవగాహన లేక సవరించాలని అంటున్నారు. గంజాయి యువత భవిష్యత్ ను నాశనం చేస్తోంది. దయచేసి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని హోంమంత్రి ఉద్బోధించారు.

## ఎవరినీ హౌస్ అరెస్ట్ చేయలేదు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరినీ హౌస్ అరెస్ట్ చేయలేదు. తిరుపతిలో ఎవరినీ నిర్బంధించలేదు. గతంలో జగన్మోహన్ రెడ్డి ఏ కార్యక్రమానికి వచ్చిన ప్రతి పక్ష నాయకులను హౌస్ అరెస్టు చేసేవారు. ఇంటి వద్ద పోలీసులను పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా లేవని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# తిరుమలను అపవిత్రం చేయటమే వారి లక్ష్యం

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేసేందుకు వైసీపీ నాయకులు కంకణం కట్టుకున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆనం.. వైసీపీ నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. టీటీడీ పాలకవర్గాన్ని అవమానిస్తూ దూషించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడం మానేసి బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. తిరుమల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో ఒక రకంగా.. ముక్కోటి ఏకాదశి సమయంలో మరో విధంగా, ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామివారి కల్యాణం సందర్భంగా.. ఇలా ప్రతిసారీ ఏదో ఒక అంశాన్ని లేవనెత్తి అనవసర విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు గోశాలపై పడ్డారు. ఇదంతా చూస్తుంటే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై నిందలు మోపడమే పనిగా పెట్టుకున్నారని అర్థమవుతోంది. బుధవారం సీపీఐ జాతీయ నాయకులు నారాయణ గోశాలకు వెళ్లారు. అక్కడ ఎలాంటి సమస్యలు లేవు, అంతా సజావుగా ఉందని చెప్పారు. వైసీపీ నాయకులు మాత్రం సవాళ్లు చేస్తున్నారు.

గోశాలలో కొన్నిసార్లు సహజ మరణాలుంటాయి. వాటిని కూడా పాలకమండలి, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ చేసిన సమయంలో అంతులేని దోపిడీకి పాల్పడ్డారు. ఆలయం నిధులను సీసీ రోడ్ల పేరుతో దోచేశారు. దేవస్థానాన్ని అడ్డుగా పెట్టుకొని రూ. వందల కోట్లు దోచేశారు. కూటమి ప్రభుత్వాన్ని తప్పుపట్టే విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. లేదంటే సవాళ్లు విసురుతున్నారు. కరుణాకర్ రెడ్డికి విజ్ఞత లేదు. మీ పునాదులు కదిలిపోయాయి. మీగురించి ఆలోచించే వారు లేరు. ఆచారాలు, టీటీడీ విధానాల పట్ల తప్పుడు ఆలోచనలు మంచిది కాదని అనం హెచ్చరించారు.

# వైసీపీ స్వార్ధరాజకీయాలను నిదర్శనం

**- మంత్రి మండిపల్లి ఆగ్రహం**

అమరావతి (చైతన్యరథం): వైసీపీ పాలనలో రాష్ట్రంలో మత విద్వేషాలకు పాలకులే ఆజ్యం పోశారని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతిలో గురువారం జరిగిన హై డ్రామాపై మంత్రి స్పందించారు. తిరుమల పవిత్రత గురించి వైసీపీ చేస్తున్న ఆరోపణలే వారి స్వార్ధ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై దాడుల జరిగాయి. రథాలు తగలబెట్టారు, విగ్రహాలు ధ్వంసం చేశారు. వైసీపీ పాలనలో మత విద్వేషాలకు ఆజ్యం పోశారు. విభజించు, పాలించు ధోరణిలో పరిపాలన చేశారు. వైసీపీ నాయకులు తమ రాజకీయ స్వార్థం గురించి తల్లిని, చెల్లిని, కులాన్ని, మతాన్ని దేన్నయినా వాడుకుంటారని మంత్రి మండిపల్లి దుయ్యబట్టారు.

చైతన్యరథం

# విద్యుత్ ఛార్జీలపై వైసీపీ అసత్య ప్రచారం

- జగన్ హయాంలో పెంచిన భారాన్నే నేటికీ ప్రజలు భరిస్తున్నారు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఛార్జీలు పెంచలేదు
- సాక్షిలో విద్యుత్ బిల్లులపై తప్పుడు కథనాలు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి స్పష్టీకరణ
- ఉయ్యూరులో 33/11 కే వీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రిగొట్టిపాటి



ఉయ్యూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నంత వరకు విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రసక్తి లేదని, విద్యుత్ ఛార్జీలను తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పేర్కొన్నారు. వైసీపీ కరపత్రం సాక్షి పత్రిక.. కూటమి ప్రభుత్వం పై బురద జల్లే విధంగా విద్యుత్ ఛార్జీల విషయంలో అసత్య ప్రచారం చేస్తుందని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెంచిన విద్యుత్ చార్జీలనే ప్రజలు నేటికీ పెనుభారంగా మోయాల్సివస్తోందని మంత్రి వివరించారు. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరులోని టిడ్కో గృహ సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్‌ను మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తో పాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి గొట్టిపాటి రాష్ట్ర ప్రజానీకానికి నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కొత్త సబ్ స్టేషన్‌లను అందుబాటులోకి తీసుకొని వస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక అవసరాలకు, పోర్ట్ పనులకు అనుకూలంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ తగు చర్యలను తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో 132 కెవి సబ్ స్టేషన్‌ను నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి పూర్తి స్థాయిలో రిపోర్ట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ రెండు పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే అన్నదాతలకు పగటిపూటే నిరంతరాయ విద్యుత్ అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. పీఎం సూర్య ఘర్ ద్వారా విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఛార్జీలను తగ్గించుకోవడంతో పాటు వినియోగదారుడే, ఉత్పత్తిదారునిగా మారవచ్చని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు.

### బురద జల్లటమే వైసీపీ పని

గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. వాటన్నింటినీ సరిదిద్ది రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు పనిగట్టుకుని మరీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. గత ఎన్నికల్లో వైసీపీ నాయకులకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినా ఆ పార్టీ నాయకుల తీరు మారలేదని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేస్తుంటే, ఉన్న పెన్షన్లను తొలగిస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

### గ్రీన్ ఎనర్జీకి అనుకూలం

గ్రీన్ ఎనర్జీకి ఆంధ్రప్రదేశ్ అనుకూల ప్రాంతమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉంచితే, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెట్టుబడిదారులను భయపెట్టి రాష్ట్రం నుంచి తరిమేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపి పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి రాయలసీమ తర్వాత ప్రకాశం జిల్లా అత్యంత అనుకూల ప్రదేశంగా మారిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు.

# పథకం ప్రకారమే విష ప్రచారం

**- ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ**



జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్లో ఈ రాష్ట్ర ప్రభుత్వంపై పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తూ, రాష్ట్ర ప్రజల మనసుల్లో విషబీజాలు నాటడానికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీ టీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి, ఎన్నికల హామీలను క్రమపద్ధతిలో అమలు చేస్తోందన్నారు. ప్రజలందరూ చంద్రబాబు నాయుడికి జేజేలు పలుకుతుంటే, దాన్ని ఓర్చుకోలేక దుర్మార్గపు వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గోవులు మరణించాయని కుట్రకు తెరలేపిన జగన్మోహన్ రెడ్డి విశ్వసనీయతను కోల్పోయారన్నారు. ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలు మానుకోవాలని హెచ్చరిస్తున్నాను అని బాలాజీ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఛాలెంజ్ విసిరి, గోవులు ఆకలితో మరణించాయని రుజువు చేయమని ఛాలెంజ్ విసిరితే, దాన్ని పక్కనపెట్టి, భూమన కరుణాకర్ రెడ్డి సమస్యను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు అడ్డుకున్నారని చెప్పడం అసంబద్ధం. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే, మీ పార్టీకి చెందిన ఎంపీ గురుమూర్తి ఎలా గోశాలకు వెళ్లారు జవాబు చెప్పాలని నూకసాని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన అక్రమాలు, అరాచకాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తిరుమలలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును, ఆదరణను చేసి ఓర్వలేక వైసీపీ నాయకులు పథకం ప్రకారం విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మీ ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నిసార్లు తిరుమలకు వచ్చారు? ఆయన ఏ రోజైనా డిక్లరేషన్ ఇచ్చారా? ఆచారాలు పాటించారా? శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేటప్పుడు హిందూ సాంప్రదాయపరంగా సతీ సమేతంగా రావాలి. జగన్‌రెడ్డి ఎప్పుడైనా సతీ సమేతంగా టీటీడీ దర్శనాలను ఎలా భ్రష్టు పట్టించారో భక్తులందరికి తెలుసు. ఇవన్నీ ఇకనైనా మానుకొని, ఆరోపణలు చేసేటప్పుడు నిర్ధారణ చేసుకొని మాట్లాడాలని హెచ్చరిస్తున్నాం. రాష్ట్రానికి, ప్రజలకు, దేవాలయాలకు హాని కలిగించే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడితే, భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటం ప్రతి ఆంధ్రుడి బాధ్యత. విమర్శలు చేయాలనుకుంటే, వాస్తవాలతో, నిజాయితీగా చేయాలి అని హెచ్చరించారు.

## వరదనీటి కాలువల మరమ్మతులు

# త్వరితగతిన పూర్తి

- వీఎంసీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రి నారాయణ సమీక్ష
- వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా ముందస్తు చర్యలు
- నగరం నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు రోడ్ల కనెక్టివిటీ పెంచాలి
- పార్కులు, రోడ్లు, ఇతర వసతుల కల్పనపై చర్చ
- మెప్మా లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పనపై అధికారులకు దిశానిర్దేశం



విజయవాడ (చైతన్యరథం): వర్షాకాలం ప్రారంభం నాటికి విజయవాడ నగరంలోని అన్ని వరద నీటి కాలువల పూడికతీతతో పాటు మరమ్మత్తులు పూర్తిచేయాలని అధికారులను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి నారాయణ ఆదేశించారు. రోడ్లపై ఎక్కడా నీరు నిలవ ఉండకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కరించడంపై మంత్రి నారాయణ గురువారం సమీక్ష నిర్వహించారు. విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బోండా ఉమా, గద్దె రామమోహన్, బోడే ప్రసాద్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత, ప్రజారోగ్యవిభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు. వీఎంసీ పరిధిలో ఉన్న సమస్యలను అధిగమించడం, అభివృద్ధి ప్రణాళికలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

### ట్రాఫిక్ ఇబ్బందులు రావొద్దు

నగరంలో త్వరలో మరో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభం కానుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకూ ఫ్లైఓవర్ నిర్మిస్తుండటంతో ఈ లోగానే ప్రత్యామ్నాయ రహదారులను ఎంపిక చేసి కొత్తగా రోడ్లు వేయాలని సూచించారు. అమరావతి నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్ కు వెళ్లే ప్రధానమైన రహదారి కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ట్రాఫిక్ మళ్లింపు కోసం పలు రహదారులను ఎంపిక చేసినట్లు ఎంపీ కేశినేని చిన్ని వివరించారు. ఈ రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ఎయిర్పోర్ట్ కారిడార్ లో గ్రీనరీ కి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

### పార్కుల అభివృద్ధికి ఎమ్మెల్యేల ప్రతిపాదనలు

మరోవైపు తమ నియోజకవర్గాల్లో పార్కుల అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేలు పలు ప్రతిపాదనలు మంత్రి ముందుంచారు. కార్పొరేషన్ లో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. నగరంలో మెప్మా లో ఉన్న స్వయం సహాయక మహిళలకు ఆదాయం సమకూరేలా పలు ప్రతిపాదనలపై చర్చించారు. మెప్మా ఎండీతో చర్చించి ఆయా అంశాలపై నిర్ణయం తీసుకోవాలని విజయవాడ కమిషనర్ ధ్యానచంద్రకు మంత్రి నారాయణ సూచించారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు.

# భూ సమస్యలపై ప్రజావినతుల్లో ఫిర్యాదులు

- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజా వినతుల కార్యక్రమం జరిగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, కబ్జాలు, వ్యక్తిగత సమస్యలపై పలువురు అర్జీలు అందజేసి న్యాయం చేయాలని కోరారు. తన కుమార్తెకు చెందిన ఐదు ఎకరాల భూమిలో వరి పంటను మెండు లక్ష్మీనారాయణ, కొక్కిలిగడ్డ మహాలక్ష్ముడు కోసుకెళ్లారని కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన కొక్కిలి గడ్డ ఏడుకొండలు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా తమను చంపేందుకు యత్నిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని తమకు పంట నష్టపరిహారంతో పాటు.. ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

– తమకు పూర్వీకుల నుంచి వచ్చిన పొలాన్ని ఎండోమెంట్ వారిదని పేర్కొంటూ ఎటువంటి ఆధారాలు లేకుండా తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చారని పల్నా డు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన చివుకుల హనుమయ్య శాస్త్రి తెలిపాడు. విచారించి తమ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.

– తర తరాలుగా తమ స్వాధీనంలో ఉంటూ అనుభవిస్తున్న తమ పొలాన్ని గత ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా 22ఏలో పెట్టారని.. దాన్ని సరిచేసి తమకు పాస్ పుస్త కాలు ఇప్పించాలని బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలానికి చెందిన గొల్లపూడి సీతారాం అర్జీ ఇచ్చారు.

– తమ భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించి తమ వద్ద ఉన్న దస్తావేజుల ప్రకారం భూమిని అడంగల్‌లో నమోదు చేయాలని పల్నాడు జిల్లా నరసరావుపేట మం డలం కాకాని గ్రామానికి చెందిన గోనుగుంట్ల రాజశేఖర్ విన్నవించారు.

– ప్రభుత్వం తమకు ఇచ్చిన గత 30 ఏళ్ల నుంచి తమ స్వాధీనంలో ఉన్న భూమికి సీసీఎల్‌ఏలో రికార్డులు మార్చి అగ్ర కులస్తుల వ్యక్తి పేరు మీదకు మార్చారని కడప జిల్లా పోరుమామిళ్ల మండలం గిరినగర్‌కు చెందిన వినయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

– ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం వెలిగండ్ల గ్రామంలో భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగా మరొకరు ఆ భూమిలోకి వచ్చి తమదని దౌర్జన్యం చేస్తున్నారని గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన శాఖమూరి ధనలక్ష్మి ఫిర్యాదు చేసింది.

– వృద్ధురాలైన తన భార్య ఇంట్లో ఉండగా లైన్‌మెన్ తమ ఇంటికి వచ్చి మరో మీట ర్ బిగిస్తామని చెప్పి తమ ఇంట్లోని కరెంట్ మీటర్ పీక్కు వెళ్లారని కడప జిల్లా కలశపాడు మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాకల వెంకట సుభానయ్య ఫిర్యాదు చేశా రు. సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు మళ్లీ బిగించలేదని.. అధికారులు మీటర్ బిగిం చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– దామిరెడ్డి రోశిరెడ్డి అనే వ్యక్తి తన వద్ద రూ.36,15,000 తీసుకుని తిరిగి ఇవ్వ మంటే తమనే బెదిరిస్తున్నాడని కడప జిల్లా కలసపాడు మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిట్టం అనురాధ ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా తనను చంపేందుకు వెంబడిస్తున్నాడని.. అతనిపై చర్యలు తీసుకుని తనకు ప్రాణ రక్షణ కల్పిం చాలని అభ్యర్థించింది.







# శ్రీవారి భక్తులకు టీటీడీ సేవలు భేష్

- అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తి
- గతంలో కన్నా మెరుగైందని అభినందన
- వసతిగదులపై పర్యవేక్షణ ఉండాలని సూచన



తిరుపతి(చైతన్యరథం): శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలపై ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తిని వ్యక్తం చేసింది. గతంలో భక్తులకు అందిస్తున్న సేవలు, ప్రస్తుతం అందిస్తున్న సేవలలో చాలా మార్పు కనిపిస్తుందని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుల్ల జోగేశ్వరరావు వెల్లడించారు. తిరుపతి పద్మావతి అతిథిగృహంలో గురువారం సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. వేగుల్ల మాట్లాడుతూ అంచనాల కమిటీ చేసిన పలు సూచనలను పరిగ ణలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలని సూచించారు. ఇటీవల తాను శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని, అనుకోకుండా అనారోగ్యానికి గురై తిరుమల లోని అశ్విని ఆసుపత్రిలో చేరగా వైద్యసేవలు బాగా అందించారని ఏపీ అంచనాల కమి టీ సభ్యులు పెన్మత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశ్విని ఆసుపత్రి సిబ్బందిని ఆయన అభినందించారు. టీటీడీలో అమ లవుతున్న సేవలపై సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వసతిగదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు. నవతరానికి శ్రీవారి వైభవాన్ని తెలియ జేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమం త్రి చంద్రబాబు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని టీటీడీ ఈవో వెల్లడించారు. వివిధ విభాగాలలో నైపుణ్యం, నిపుణుల సేవలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఈవో తెలిపారు. అదేవిధంగా తిరుమలలో క్రమం తప్పకుండా టీటీడీ సేవలపై ప్రకటనలు ఇవ్వాలని, టీటీడీ వసతిగృహాలలో అన్ని చోట్లా వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి చిత్రపటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవింద నామావళిని రాత్రి 10 గంటల వరకు విని పించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా..ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో సమాధానమిచ్చారు. తిరుమలలో వసతిగదుల నిర్మాణాలపై సభ్యులు అడిగి న ప్రశ్నలకు ఈవో సమాధానం ఇస్తూ కాలం చెల్లిన భవనాల స్థానంలో కొత్త భవనాలు, మరమ్మతులు మినహా హైకోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. వసతిగదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని ఈవో తెలిపారు. కాషన్ డిపాజిట్‌ను భక్తులకు సకాలంలో చెల్లించేందుకు మరింత పటిష్ట చర్యలు చేప ట్టామన్నారు. ఒకరి పేరుతో వసతి గది తీసుకుని మరొకరు వచ్చి ఫేస్ రికగ్నిషన్ కోసం రావడం వల్ల చెల్లింపులో ఆలస్యం కావడం మినహా, కాషన్ డిపాజిట్‌ను సంబంధిత వ్యక్తులకు సకాలంలో చెల్లింపు చేస్తున్నామన్నారు. వైకుంఠం-1,2లలో భక్తులకు అంది స్తున్న అత్యవసర వైద్యసేవ లపై సభ్యులు అడిగి తెలుసుకున్నారు.

### ఉచితంగా స్వామి, అమ్మవారి విగ్రహాలు

శ్రీవాణి ట్రస్ట్‌పై సభ్యులు అడిగిన సమాచారాన్ని సభ్యులకు ఈవో తెలియజేశారు. టీటీడీ ఆధ్వర్యంలో చేస్తున్న స్వామివారి, అమ్మవారి రాతి విగ్రహాల తయారీ, పంపిణీ వివరాలను సభ్యులు అడగగా ఈవో సమాధానమిస్తూ హిందూ ఆలయాలకు 5 అడు గుల లోపు ఉన్న స్వామి, అమ్మ వారి విగ్రహాలను ఉచితంగా అందిస్తామని, ఏపీ, తెలం గాణ రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల ప్రాంతాలలో ఉచితంగా సరఫరా చేస్తామని ఈవో చెప్పారు. ముందుగా తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టీటీడీ అదనపు ఈవో సిహెచ్. వెంకయ్యచౌదరి ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో ఏపీ అంచనాల కమి టీ సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వాల్మీకి పార్థసారథి, పాశిం సునీల్‌కుమార్, ఏలూరు సాంబశివరావు, వరుదు కళ్యాణి, పెన్మత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు, టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం, సీఈ సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదు

- కాలువల నుంచి ట్యాంకులు, చెరువులు నింపండి
- వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి
- సమస్యలపై ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేయండి
- ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్త కుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి తాగునీటి సరఫరాకు సంబంధించిన వేసవి కార్యాచరణ ప్రణాళిక, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన వేసవి కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేసవి నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉన్న 332 మండలాల్లోని 3,438 ఆవాసాలను గుర్తించి 67.31 కోట్లతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫ రా చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రైవేట్ తాగునీటి వనరులను అద్దె ప్రాతిప దికప తీసుకుని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆదేశించారు. అంతేగాక తాత్కాలిక నీటి సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, మరమ్మతులు, తాగునీటి చెరువులను నీటితో నింపడం, చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించడం ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీక రించి సకాలంలో వాటిపై స్పందించి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. అన్ని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని సూచించా రు. కాలువల నుంచి చెరువులను నీటిని నీటితో నింపాలని సూచించారు.

ఇదే సమయంలో అన్ని మంచినీటి పంపిణీ లైన్లు, పంపింగ్ మెయిన్‌లను పూర్తిగా తనిఖీ చేసి నీటి లీకేజీలను అరికట్టాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలిగితే నీటి సరఫ రాలో ఆటంకం కలగకుండా స్టాండ్‌పై జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతి పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు స్వీక రించి సకాలంలో పరిష్కరించేందుకు ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. దాతలు, ఇతర సంస్థల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి కాలుష్యం వల్ల వ్యాధులు ప్రబ లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై సమీక్ష

అనంతరం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై సమీక్షిస్తూ ప్రతినెలా స్వచ్ఛాం ధ్ర దినోత్సవాన్ని సక్రమంగా నిర్వహించడం ద్వారా కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాల(ఈ-వేస్ట్) సక్రమ నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచిం చారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వాలని, వాటిని సక్రమంగా పారవేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవా లని చెప్పారు. వారానికి ఒకసారి ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాల్లో ప్రజల భాగ స్వామ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ-వ్యర్థాల ప్రాసెసింగ్‌పై సాంకేతిక సహకారాన్ని అందించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తగిన తోడ్పాటును అందిస్తారని తెలిపారు. ఈ-వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, కరపత్రాలు, ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేసి ప్రజలకు అవగాహన కలిగించా లని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జీఏడీ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషిక్ట్ కిషోర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# బొత్స వ్యాఖ్యలు ఆయన అజ్ఞానానికి నిదర్శనం

- దిగ్గజ కంపెనీలు రాష్ట్రం వైపు చూస్తున్నాయి
- పరిశ్రమలు రావడం లేదని వైసీపీ విషప్రచారం
- కమీషన్ల కోసం కంపెనీలను తరిమేసిన చరిత్ర జగన్‌ది
- ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలి
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి హితవు



విశాఖపట్నం(చైతన్యరథం): రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విశాఖ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కూటమి 10 నెలల పాలనలో ఏపీకి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులు వైసీపీ నేతల కళ్లకు కని పించడం లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎం అయ్యాక దిగ్గజ కంపెనీలన్నీ రాష్ట్రం వైపు చూస్తున్నాయి. 10 నెల్లలోనే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులతో 6 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కావల సిన అన్ని అనుమతులు, సౌకర్యాలు కల్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పారి శ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతున్నారు. వైసీపీ హయాంలో లులు, అమర్‌రాజా, ఏషియన్ పేపర్ మిల్ వంటి అనేక పరిశ్రమలు రాష్ట్రం వీడి ఎందుకు పారిపోయాయి? కమీషన్ల కోసం రాష్ట్రంలో ఉన్న కంపెనీలను తరిమేసి యువతకు ఉపాధి లేకుండా చేసిన చరిత్ర జగన్‌దని మండిపడ్డారు. దావోస్‌లో చలి ఎక్కువ అని నాడు మీ మంత్రి ఇంట్లో కూర్చుం టే నేడు రాష్ట్ర యువత కోసం దావోస్‌లో యువనేత, మంత్రి లోకేష్ కాలినడకన పర్య టించారు. జగన్ మీద నమ్మకం లేక వైసీపీ కార్పొరేటర్లే ఆ పార్టీ నుంచి పారిపోతున్నా రని వ్యాఖ్యానించారు. ఇంకా వైసీపీ నేతలు అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలను కోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ప్రజలు పూలు చల్లి ఆశీర్వదించిన కూటమి ప్రభుత్వం పై వైసీపీ నేతలు అబద్ధాలతో బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు.

# స్థానిక సంస్థలకు నిధులివ్వండి

## పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వండి - 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు వినతి




తిరుపతి(చైతన్యరథం): తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, వాణిజ్య-పారిశ్రామికవేత్తలతో 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మాథ్యూ, మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృత, ఆదిత్య పంత్, జ్యోతి నాగర్కోటి, అభయ్ మీనన్ సమావేశమయ్యారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్ పీయూష్‌కుమార్, అడిషనల్ సెక్రటరీ ఫైనాన్స్ జె.నివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరె క్టర్ కృష్ణతేజ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జేసీ శుభం భన్సల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థానిక సంస్థల నుంచి సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు పాల్గొనగా అర్బన్ లోకల్ బాడీస్ ప్రతినిధులు, మునిసిపల్ మేయర్, ఛైర్మన్‌లు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థపై వివరిస్తూ గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు కేంద్రం నుంచి నిధుల విడుదల, పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధిలైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు తదితర ముఖ్యమైన అంశాలపై కేంద్రం నుంచి నిధులకు విన్నవించారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వగలిగితే మరింత మెరు గ్గా పౌరులకు సౌకర్యాలు, సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

వాణిజ్య, పారిశ్రామికవేత్తలు కమిషన్ దృష్టికి పరిశ్రమలకు సంబంధించిన పలు అంశాల ను తీసుకెళుతూ ఎంఎస్‌ఎంఈ, స్మాల్ అండ్ మీడియం పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సా హకాలు, పవర్ సబ్సిడీ మరింత నిధులు విడుదల చేయాలని, ఏపీ రీ ఆర్గనైజేషన్ పెం డింగ్ అంశాలు, రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, అసోచామ్, ఫ్యాప్సియా, డీఐసీసీఐ, ఎఫ్ఎస్ ఎంఈ తదితర పారిశ్రామికవేత్తలు కమిషన్‌ను కోరారు. గ్రామీణ పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వాణిజ్య పారిశ్రామికవేత్తల సూచనలు, అభిప్రాయాలను కమిషన్ పరిశీలిస్తుందని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ తెలిపారు. పలువురు స్థానిక సంస్థల ప్రతినిధు లు లిఖిత పూర్వకంగా కమిషన్ ఛైర్మన్‌కు సూచనలు, సలహాలను అందజేశారు.

# రైతులకు అండగా ప్రభుత్వం

- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం
- గోతాల సరఫరాకు చర్యలు తీసుకుంటాం
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్



కంకిపాడు(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత దాల్వా కాలంలో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.590 కోట్లు 24 గంటల్లోనే రైతులకు చెల్లించిందని, ఈ కాలంలో చిట్టచివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తుందని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గురువారం సాయంత్రం పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలాని సమూన్, కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కంకిపాడు మండలంలోని పునాదిపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, ధాన్యం ఆరబెట్టు కేంద్రం, బాలాజీ మిల్లు, పెనమలూరు మండలం వణుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తొలుత పునాది పాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మిల్లుల దగ్గర, తేమ విష యంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ధాన్యం ఉత్పత్తి పెరి గినందున గోతం సంచుల కొరత ఉందని, వర్షం వచ్చినప్పుడు ధాన్యం కప్పుకోవడానికి టార్పాలిన్ పట్టలు సరఫరా చేయాలని, రవాణా కిరాయి డబ్బులు రావాలని రైతులు మంత్రికి విన్నవించారు. దీంతో మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైనన్ని గోతం సంచులు రైతులకు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ అధికారులు, సంయుక్త కలెక్టర్‌కు సూచించారు. తమకు ఇచ్చిన 600 గోతం సంచుల లో 100 సంచులు దెబ్బతిని ఉపయోగపడటం లేదని..సరైన గోతాలు ఇవ్వాలని, ధాన్యం ఆరబెట్టుటకు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని మరికొందరు రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో సంప్రదించి ప్రతి పంచాయ తీలోనూ ధాన్యం ఆరబెట్టుటకు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. మంచి గోతం సంచులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కంకిపాడు మండలంలో జాతీయ రహదారి పక్కన గల బాలాజీ మిల్లును పరిశీలించి యజమాని వెంకటరావుతో మాట్లాడుతూ రైతుల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయని, మూడురోజుల్లో సావధా నంగా రైతులతో మాట్లాడి సరిచేసుకోవాలని, లేనిపక్షంలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపిస్తామని హెచ్చరించారు. అనంత రం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్ సీజన్లో సుమారు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.8600 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందో పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. దాల్వా రెండో పంట చాలా అద్భుతంగా కొనుగోలు జరుగుతుందన్నారు. ఈసారి ధాన్యం ఉత్పత్తి బాగా పెరిగిందని.. దీంతో కొంత గోతం సంచుల కొరత ఏర్పడిందన్నారు. గతంలో వ్యవసా య శాఖ అంచనాల ప్రకారం 35 గోతం సంచులు ఇవ్వడం జరుగుతోందని..అయితే ఈసారి దిగుబడి పెరగడంతో 60 నుంచి 65 బస్తాల ధాన్యం వచ్చిందన్నారు. దీంతో రైతుల అవసరాలను బట్టి 70 గోతం సంచుల సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లుల దగ్గర 4 గంటల కంటే ఎక్కువ సమయం వాహనం ఉంటే జీపీఎస్ ద్వారా సమాచారం తమకు వచ్చి చేరుతుందని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఒక భరోసా కల్పించే విధంగా ఇలాంటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, ఎన్ని వేల మెట్రిక్ టన్నులైనా కొను గోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కృష్ణా జిల్లాలో సరిపోకపోతే ఇతర జిల్లాల మిల్లులకు తరలించైనా ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. వర్షాలకు దెబ్బతినే మొక్క జొన్న, జొన్న, మినుము ఏ పంటకైనా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, డీఎస్‌వో పి.పార్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి మనోహర్, మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం, ఆర్టీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మూగజీవాలపైనా అభాండాలా...?

- పరమపవిత్రమైన గోమాతకు అపకీర్తి తెస్తారా...?
- హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించేది లేదు
- గత పాలనలో టీటీడీ గోసంరక్షణశాలల్లో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావు
- టిటిడి పవిత్రను మంటగలిపిన ఘనత గత వైకాపా ప్రభుత్వానిదే
- వేంకటేశ్వరునితో ఆటలు మంచివి కావు-వైకాపా నాయకులూ ఖబడ్దార్
- మీడియా సమావేశంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ 'వీరంకి' హెచ్చరిక



మచిలీపట్నం, ఏప్రిల్ 17 : హిందు ధార్మిక సమాజంలో గోవుకు ఎంతో ప్రశస్త్యం ఉందని, గోమాతను హింధూబంధువులంతా పరమభక్తితో పూజిస్తారని, గోవులో ముక్కోటి దేవతలు కొలువై ఉన్నారని పండితులు చెబుతారని, పురాణ, ఇతిహాసాల్లోను ఆవుకు ఉన్న ప్రాధాన్యం జగమెరిగిన సత్యమని, అటువంటి ఆవులపట్ల, కలియుగ వేంకటేశ్వరుని ఆలయ (టిటిడి) నిర్వహణ పట్ల వైకాపా నాయకులు మాట్లాడుతున్న తీరు అత్యంత జుగుప్సాకరమని, వారి కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనమని, వైకాపా నాయకులు వ్యాఖ్యలు మత విద్వేశాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని, హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని, తక్షణం వైకాపా నాయకులు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి డిమాండ్ చేశారు. ఎస్వీ గోశాలపై వైకాపా నేతల ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని, వైకాపా హయాంలో తితిదేలో ఎన్నో అక్రమాలు జరిగాయని గురుమూర్తి మండిపడ్డారు. ఎస్వీ గోశాలపై వైకాపా నాయకులు, టిటిడి బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గురుమూర్తి గురువారం మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా హయాంలో టిటిడి పవిత్రను మంటగలిపిన ఘనత వైకాపాదేనన్నారు. నోరు లేని మూగజీవాలపైనా అభాండాలు వేస్తారా అంటూ వీరంకి నిలదీశారు.పరమపవిత్రమైన గోమాతకు అపకీర్తి తెస్తారా...? అంటూ దుమ్మెత్తిపోశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించేది లేదని, గత పాలనలో టీటీడీ గోసంరక్షణశాలల్లో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'మొగుడ్ని కొట్టి మొగసాలకి ఎక్కినట్లు' టీటీడీలో గత ప్రభుత్వంలో జరిగిన దారుణాలు ఎక్కడ కూటమి ప్రభుత్వం చేపట్టిన టీటీడీ సమూల ప్రక్షాళనలో బయటపడతాయనే భయంతో, ముందుగానే రోడ్డెక్కి కూటమిపై నిందలు వేస్తున్న వైసీపీ నేతల ప్రయత్నాల్లో భాగమే భూమన ఆరోపణలని, వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ గోసంరక్షణ శాలల్లో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావని, చనిపోయిన ఆవులు, దూడలను నిర్దాక్షణంగా చెత్తబుట్టల్లో పారేసిన నీచనికృష్ఠులని వీరంకి వైకాపా నేతల తీరుపై నిప్పులు చెరిగారు. చాలాచోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతి చేసి పందికొక్కుల మాదిరి బొక్కేవారని, గోవులకు నాసిరకం దాణా, కాలంచెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాల ప్రాణాలను తీసి ఉసురుకట్టుకున్నారని తూర్పారపట్టారు. గోవులు మరణించిన ఆ లెక్కలు బయటకు రాకుండా తొక్కి పెట్టారని, ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డే బాధ్యుడని, విచారణలో ఎక్కడ తన అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతో విజిలెన్సు అధికారులను గోశాలలోకి రాకుండా ఇష్టానుసారం వ్యవహరించాడంటూ ఆరోపణలు గుప్పించారు. దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వంలో ఏప్రిల్, 2022 - జనవరి 2023 మధ్యన తిరుపతిలోని ఎస్వీ గోశాల 27, పలమనేరు కమలయ్యగారిపల్లి - 7 కేవలం 10 నెలల వ్యవధిలో 60 ఆవులు, దూడలను నిర్లక్ష్యంతో పొట్టనపెట్టుకున్న దుష్టులని దుమ్మెత్తిపోశారు. గత ప్రభుత్వం హయంలో తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఆరోగ్యకరమైన ఆవులు సైతం, వసతులు లేమితో, సిబ్బంది నిర్లక్ష్యంతో, చికిత్స అందక ఎన్నో మూగజీవాలు మృత్యువాతపడ్డాయని, విరాళంగా వచ్చిన గోవుల రికార్డులు కూడా సరిగా నిర్వహించలేదని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ ఏకైక ఎజెండా తిరుమల పవిత్రతను నాశనం చేయడమేనన్నారు. బహిరంగ మార్కెట్ లో రూ.700 పలికే నెయ్యిని రూ.320కే కల్తీ నెయ్యి కొనుగోలు చేసి స్వామివారికి కల్తీ నైవైద్యాలు పెట్టి పాపం మూటగట్టుకున్నారని, కనీసం రూ.80 లక్షలతో నాణ్యతను నిర్ధారించే పరికరాలు కొనలేని అసమర్థులను టీటీడీ పాలకమండలిలో జగన్ ప్రభుత్వం చోటుకల్పించిందని మండిపడ్డారు. కిలో రూ.600 కూడా చెయ్యని నాణ్యత లేని నెయ్యికి కిలో రూ. 2వేలు, కిలో రూ. 50 లు పలికే బియ్యం కిలో రూ. 90లు, కిలో రూ.60 వున్న బెల్లం కిలో రూ.120గా కొనుగోలు చేసి స్వామివారి సొమ్ముతో బొక్కసాలు నింపుకున్నారంటూ వీరంకి విమర్శలు సంధించారు.

2021 జులై 22న విజిలెన్స్ నివేదిక ప్రకారం టీటీడీకి రూ. కోట్ల నష్టం వాటిల్లిందని, 2023 ఏప్రిల్ 6న ఆవులకు నాచుపట్టిన నీరు, కుళ్లిన దాణా ఇచ్చినట్లు విజిలెన్స్ ధ్రువీకరించిందని, నాణ్యత లేని దాణా, నిర్లక్ష్య నిర్వహణతో అనేక ఆవులు మరణించగా, వాటి సంఖ్యను తక్కువగా చూపారని, 'గుడికో గోమాత' కార్యక్రమంలో 196 గోవులను ఆలయాలకు ఇచ్చినా, వాటి సంరక్షణను పట్టించుకోలేదని, గతంలో తిరుపతి గోసంరక్షణశాలలో రోజుకు 450 లీటర్ల పాల ఉత్పత్తి జరగ్గా, ఇప్పుడు అది 762 లీటర్లకు పెరిగిందని, దమ్ముంటే గోశాలకు వచ్చి అక్కడ పరిస్థితులు పరిశీలించుకోవచ్చని ప్రభుత్వం విసిరిన సవాలు స్వీకరించేలేని దద్దమ్మలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందలు మోపటం, విష ప్రచారం చేయటం అబద్ధాల మీద పుట్టిన వైసీపీ పార్టీకి పరిపాటి అని, న్యాయబద్ధంగా నడుచుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికి అదే సవాలు సవాల్ చేస్తోందని, దమ్ముంటే జగన్ ముఠా వచ్చి పరిశీలించుకోవచ్చని, లేదంటే... చేస్తున్న అసత్య ప్రచారాన్ని బహిరంగంగా ఒప్పుకుని, కలియుగ వేంకటేశ్వరుడిపై చేసిన పాపాలకూ, హిందూ సమాజాన్ని కించపరిచిన చర్యలకూ జగన్ రెడ్డి దేవుడితో పాటు హిందువులకు క్షమాపణ చెప్పాలని వీరంకి గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామకృష్ణ,జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న వైసీపీ

**● టీటీడీ కార్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా గత ప్రభుత్వం వాడుకుంది**

**: మాజీమంత్రి కిడారి శ్రావణ్‌కుమార్**



అరకు (చైతన్యరథం): హిందువుల మనోభావాలు వైసీపీ ప్రభుత్వంలోనే దెబ్బతిన్నాయని, టీటీడీని వైసీపీ కార్యాలయం లాగా గత ప్రభుత్వం వాడుకుందని మాజీ మంత్రి, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ పాలనలో టీటీడీని వైసీపీ వ్యాపార సంస్థ లాగా మార్చుకుని ఇష్టారాజ్యాంగ వ్యవహరించారని, వైసీపీ ప్రభుత్వం హిందువుల మనోభావాలు గాయపరిచే విధంగా వ్యవహరించిందన్నారు. గోశాల మరణాలపై వైసీపీ తప్పుడు వార్తలను ప్రచారం చేయడం దురదృష్టకరమని, ఫేక్ న్యూస్‌లతో ప్రజల మనోభావాలకును కించపరిచే ప్రయత్నం వైసీపీ చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంఓ లేగ దూడలు చనిపోయాయని, ఎస్వీ గోసాలలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులను ఫోటోలు తీసుకోనివ్వకుండా డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి నాడు అడ్డుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ మూడు నెలల్లోనే ఎస్వీ గోశాలలో 59 దూడలు జన్మించాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతి చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు గోశాలలోని గోవులపై మోసలి కన్నీరు కార్చుతున్నారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీటీడీలో అంతులేని అవినీతి చోటుచేసుకుందని, టీటీడీని అడ్డగోలుగా వైసీపీ సంపాదనకు అడ్డగా మార్చేశారని దుయ్యబట్టారు. కూటమి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, అది చూసి ఓర్వలేని వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ బాకుర్ వెంకటరమణ, హుకుంపేట మండల కార్యదర్శి సూర్యకాంతం, వైస్ ఎంపీపీ అమ్మన్న, టీడీపీ డివిజన్ నాయకులు ధారల సర్పంచ్, పాంగి పాండురంగ స్వామి, ఎంపీటీసీ కొమ్మరమ్మ, మహిళ నాయకులు మహేశ్వరి, కళ ద్రౌపతి, ఎంపీటీసీ సాయిరాం, త్రినాధ్, మురళి, అచ్చిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతాం : ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నారని, ప్రతి దళిత కులానికి సామాజిక న్యాయం జరుగుతుందని, అందుకోసం ముఖ్యమంత్రి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి వచ్చిన తర్వాత దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. గతంలో 59 దళిత కులాల్లో ఎస్సీ మాలా, మాదిగ ప్రధాన కులాలకు తప్ప మిగతా ఏ దళిత ఉప కులానికి న్యాయం జరగలేదని, అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ జరిగిందన్న విషయం అందరికీ తెలిసిందేనని, ఇది ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎస్సీ ఏ,బి,సి,డి అనే గ్రూపులో ఉండేవి అని, ఇప్పుడు ఏ,బి,సి గ్రూపులుగా విభజించడం జరిగిందని, అందులో ఏ-గ్రూపులో మా సోదరులు రెల్లి కులస్తులను చేర్చడం జరిగిందని, బి గ్రూపులో మాదిగ సోదరులు తోపాటు వారి ఉపకులాలను చేర్చడం జరిగిందని, సి- గ్రూపులో మా సోదరులు మాల, వారి ఉపకులాలను చేర్చడం జరిగిందన్నారు. ఇవన్నీ 2011వ సంవత్సరం జనాభా ప్రాతిపదికన విభజించడం జరిగిందన్నారు. రెల్లి కులస్తులకు ఎంతో ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతో ఈ అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రెల్లి కులస్తులకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమన్నారు. రెల్లి కుల సంక్షేమ సంఘం మన్యం జిల్లా నాయకులు పాలకొండ రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీసుకురాడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేయడం చాలా ఆనందంగా ఉందనని అన్నారు. ఎస్సీ-ఏ క్యాటగిరిలో రెల్లి కులస్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. రెల్లి కులస్తుల్లో కేవలం మహిళల్లో ఒకరికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం కాకుండా పురుషులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు.

# విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యం : మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి (చైతన్యరథం): విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, అభ్యసన ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యలో సంస్కరణలు తీసుకురాబోతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి మండలం లింగాలవలస గ్రామంలో రూ.18.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు మెరుగు పరచాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వ పనిచే స్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి మండలం లింగాలవలస గ్రామంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సాంఘిక, సంక్షేమ వసతి గృహాలను పరిశీలించిన మంత్రి డోలా

మధురవాడ (చైతన్యరథం): సాంఘిక, సంక్షేమ శాఖ విద్యార్థి వసతి గృహాలను మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రెండు వసతి గృహాల్లో ఇటీవల నిర్వహించిన మరమ్మతు పనులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యాల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, ఈ విషయంలో ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో ఆహారం అందిస్తామన్నారు. రూ.52 లక్షలతో రెండు వసతి గృహాలకు మరమ్మతులు చేశామన్నారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా వసతి గృహాల సంక్షేమానికి రూ.143 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. అలాగే రూ.101 కోట్లతో కొత్త వసతి గృహాలు నిర్మిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఆర్డీవో సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

**బొత్స మాటలు అజ్ఞానానికి నిదర్శనం**

రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం నాడు విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.....రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని బొత్స సత్యనారాయణ మాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. కూటమి 10 నెలల పాలనలో ఏపీకి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులు వైసీపీ నేతల కళ్లకు కనిపించడం లేదా ?చంద్రబాబు సీఎం అయ్యాక దిగ్గజ కంపెనీలన్నీ రాష్ట్రం వైపు చూస్తున్నాయి. 10 నెలల్లోనే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులతో 6 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన అన్ని అనుమతులు, సౌకర్యాలు కల్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దుతున్నారు. వైసీపీ హయాంలో లూలు, అమర్ రాజా, ఏసియన్ పేపర్ మిల్ వంటి అనేక పరిశ్రమలు రాష్ట్రం వీడి ఎందుకు పారిపోయాయి? కమీషన్ల కోసం రాష్ట్రంలో ఉన్న



కంపెనీలు తరిమేసి యువతకు ఉపాధి లేకుండా చేసిన చరిత్ర జగన్ ది. దావోస్ లో చలి ఎక్కువ అని నాడు మీ మంత్రి ఇంట్లో కూర్చుంటే నేడు రాష్ట్ర యువత కోసం దావోస్ మంత్రి లోకేష్ కాలినడకన పర్యటించారు.

జగన్ మీద నమ్మకం లేక వైసీపీ కార్పొరేటర్లే ఆ పార్టీ నుంచి పారిపోతున్నారు. ఇంకా వైసీపీ నేతలు అబద్ధాలతో ప్రజల్ని మభ్య పెట్టాలనుకోవడం సిగ్గుచేటు. ప్రజలు పూలు చల్లి ఆశీర్వదించిన కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు అబద్దాలతో బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ హితవు పలికారు.



# ముగిసిన పాలిసెట్ దరఖాస్తు... ఏప్రిల్ 30న పరీక్ష

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ 2025 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ముగుస్తోంది. తొలుత ఇచ్చిన ప్రకటన మేరకు ఏప్రిల్ 15వ తేదీతోనే దరఖాస్తు గడువు ముగిసింది. అయితే అభ్యర్థుల విన్నపం మేరకు మరో రెండు రోజులు పొడిగిస్తూ సాంకేతిక విద్య సంచాలకులు ప్రకటించారు. గడువు ఏప్రిల్ 15తో ముగిసిన నేపథ్యంలో 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో ఎలాంటి ఆలస్య రుసుములేకుండా మరికొంత మంది అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది.

**150 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం :**

ఇక గురువారం (ఏప్రిల్ 17)తో దరఖాస్తు గడువు ముగిసింది. ఇక ఏప్రిల్ 30న రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది పాలీసెట్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం1.50 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచానా వేస్తున్నారు. ఫలితాలు మే నెలలో విడుదలవనున్నాయి.

**తెలంగాణ పాలిసెట్ 2025కు భారీగా తగ్గిన దరఖాస్తులు**

తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ పాలిసెట్‌కు ఈ ఏడాది దరఖాస్తులు భారీగా తగ్గాయి. గతేడాది 92 వేల దరఖాస్తులు రాగా ఈ ఏడాది మాత్రం 79 వేల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, వారిలో 77 వేల మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఏప్రిల్ 19వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుంది. రూ.100 అపరాధ రుసుముతో 21వరకు, రూ.300 అపరాధ రుసుముతో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.



# చంద్రబాబు పాలన స్వర్ణయుగం : మంత్రి నిమ్మల

## •1.71 కోట్లతో పంట కాలవలు వెంబడి గ్రావెల్ రహదారులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): జగన్ ఐదేళ్ల పాలన చీకటమయమైతే.. నేడు చంద్రబాబు పాలన స్వర్ణ యుగం వంటిదని రాష్ట్ర జలవనర్ల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు.... మన రామానాయుడు కార్యక్రమంలో రూ1.71 కోట్లతో పాలకొల్లు మండలం శివ దేవుని చిక్కాల, బల్లిపాడు గ్రామాల్లో పంట కాలవల వెంబడి గ్రావెల్ రహదారుల నిర్మాణ పనులకు ఆయన కూటమి నాయకులతో కలిసి భూమి పూజ జరిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులకు మేలు జరిగే పనులు కోట్లాది రూపాయలతో చేపడుతున్నారటూ పెద్దఎత్తున రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి రామానాయుడుకు జేజేలు పలికారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీల నాయకత్వం జిందాబాద్ రామానాయుడు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు ఇచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... గత ఐదేళ్లలో రైతాంగానికి ఎటువంటి మేలు జరగలేదని, నేడు చంద్రబాబు పాలనలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర బడ్జెట్లో జలవనరుల శాఖకు 18,019 కోట్ల రూపాయలు కేటాయింపు జరిగిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా లష్కర్లకు, జగన్ ప్రభుత్వం ఎగ్గొట్టిన జీతం బకాయిలు చెల్లించడానికి, ఆరు కోట్ల యాభై ఏడు లక్షలను చంద్రబాబు విడుదల చేశారన్నారు.చీకటి ఒప్పందాలతో అంతర్జాతీయ స్థాయిలో అపఖ్యాతి పాలైన జగన్, విద్యుత్ బిల్లులపై మాట్లాడడం చూస్తే, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ప్రజా బహిష్కారానికి గురైన జగన్, అసెంబ్లీకి ఎగ్గొట్టేసి, తన తప్పుడు అవినీతి పత్రిక సాక్షి, ఛానల్, ద్వారా అబద్దాలు అచ్చేసి రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్నాడని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో 9 నెలల కూటమి ప్రభుత్వంలో పంట కాలముల వెంబడి 130 వరకు గ్రావెల్ రహదారుల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టబోతున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లను గత వైసీపీ ఐదేళ్లలో పట్టించుకోకపోవడంతో మళ్లీ ఇప్పుడు మా ప్రభుత్వమే వేస్తుందని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ సర్పంచ్ ఇందిరాదేవి, దిడ్ల మని వజ్రం, ఇంటి శ్రీరాములు, నడపన శ్రీనివాస్, దండు కాసిరాజు, పడమట మావుళ్ళు, పనమట సత్యనారాయణమూర్తి, అయినపర్తి వెంకటేశ్వరరావు, అంగర బాబురావు, మంద నాగమణి, మద్దుకూరి విజయలక్ష్మి, మామిడి రత్నకుమారి, సాధనల ఉదయ భాస్కర్, వద్దే సోమ చంద్రశేఖర్, కోటిపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



**•బీసీ కార్పొరేషన్ రుణాల పంపిణీ**

**•ఉచిత కుట్టు మిషన్ కేంద్రాల ప్రారంభోత్సవం**

**•గ్రామపంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ**

కనిగిరి (చైతన్యరథం): నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరుగును వేగవంతం చేస్తూ, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, బీసీ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరైన రుణాల ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "బీసీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణాలను దుర్వినియోగం చేయకుండా, వాటిని సద్వినియోగం చేసుకోవాలి. వెంటనే పనులు ప్రారంభించి యూనిట్లను స్థిరపరిచి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుతున్నాను," అని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మహిళల్లో ఆత్మ గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం నిర్వహించడం జరుగుతోందనికనిగిరిలో 2 కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలోఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మహిళలలో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు. మహిళలకు 3 నెలలపాటు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కుట్టు మిషన్ నేర్చుకునే మహిళలు ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరచడానికి ఈ కుట్టు మిషన్ కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. "మహిళలు స్వయం శక్తితో ఉపాధిని సంపాదించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది. అవకాశాలను ఉపయోగించుకొని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలి," అని ఆయన అన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ నిధుల ద్వారా మంజూరైన 10 ట్రాక్టర్లను గ్రామపంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "గ్రామపంచాయతీలు ట్రాక్టర్లను సమర్థవంతంగా వినియోగించుకుని, చెత్త రహిత పంచాయతీలుగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

# డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు... ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల సుబ్బారావు



అమరావతి (చైతన్యరథం): కాకినాడలో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య, అనంతరం మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన కేసులో కదలిక వచ్చింది. దీనిపై ప్రాసిక్యూషన్కు సహాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదిని నియమించింది. ముప్పాళ్ల సుబ్బారావును ప్రత్యేక న్యాయవాదిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తన వద్ద డ్రైవర్గా పని చేస్తున్న కాకినాడకు చెందిన వీధి సుబ్రహ్మణ్యం అనే దళిత యువకుడిని వైకాపా నేత అనంతబాబు హత్య చేసి.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసినట్లు ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ కేసు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరు.. పోలీసుల దర్యాప్తుపై ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ న్యాయవాది, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు తీవ్ర పోరాటం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో గతంలో ఇదే కేసుపై న్యాయపోరాటం చేసిన ముప్పాళ్ల సుబ్బారావును ప్రత్యేక న్యాయవాదిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రైతులకు పూర్తి న్యాయం చేయాలి

## •పర్యావరణ ప్రజాభిసేకరణ సదస్సులో ఓఎన్జీసీ సంస్థను డిమాండ్ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): ఓఎన్జీసీ సంస్థ ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధిని చేసుకోవడం మా హక్కు అయిన అభివృద్ధిని చేసి తీరాలని ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామం ఓఎన్జీసీ జీసీఎస్టేషన్ వద్ద ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. అలాగే 8110 కోట్ల రూపాయల ప్రాజెక్టుకు సంబంధించి ఓఎన్జీసీ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడానికి చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలను సేకరించి వాటిని పరిశీలించాలన్నారు. సంస్థ కార్యకలాపాల విలువను బట్టి స్థానిక ప్రాంతాల అభివృద్ధికి ఇవ్వాల్సిన వాటా హక్కును ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధి కోసం కోరిన మేరకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అలాగే సంస్థ కార్యకలాపాలు ప్రారంభించడానికి రైతుల నుండి భూములు లీజుకు తీసుకుంటున్నారని పని పూర్తయ్యాక రైతులను సంస్థ పట్టించుకోవడం లేదన్నారు. మరలా ఆ భూములు రైతులకు ఉపయోగకరంగా ఉండటం లేదని దాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు పూర్తి న్యాయం చేయాలని ఓఎన్జీసీ అధికారులను కోరారు. గ్రామాల్లో రోడ్ల,వంతెనల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు 84.96 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని ఓఎన్జీసీ అధికారులకు ఎమ్మెల్యే సత్యానందరావు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 22 నుంచి డెల్టా కాలువలు మసివేత



రాజమహేంద్రవరం (చైతన్యరథం): డెల్టా కాలువలు ఈనెల 22 నుంచి మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షెట్టర్ లు, లాకులు వంటి మరమ్మతులు(క్లోజర్ పనులు) చేపట్టడానికి కాల్వలకు నీటి విడుదల నిలిపివేస్తారు.డెల్టా కాలువలు ఈనెల 16వ తేదీనే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఈ నెల 22 వరకు నీటిని విడుదల గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదే శాలతో కాల్వల మూసివేతను 22వ తేదీ వరకు వాయిదా వేశారు. బుధవారం కాటన్బ్యారేజ్ నుంచి తూర్పుడెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

**రబీని గట్టెక్కించిన సీలేరు జలాలు**

తూర్పు,మధ్య, పశ్చిమ డెల్టాలోని 8.96 లక్షల ఎకరాలకు రబీలో సాగునీటిని సమృద్ధిగా అం దించారు. డిసెంబర్ నుంచి నేటి వరకు మూడు డెల్టా కాలువలకు 114.644 టీఎంసీల నీటిని కా టన్ బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సీలేరు నుంచి పవర్ జనరేషన్ద్వారా 44.084 టీఎంసీలు గోదావరికి విడుదల కాగా బైపాస్ మార్గం ద్వారా నేరుగా 17.781టీఎంసీలు విడుదల చేశారు. సీలేరు నుంచి మొత్తం 61.865 టీఎంసీలు గోదావరికి విడుదలయ్యాయి. పోలవరం వద్ద 16 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయని అధికారులు లెక్కకట్టగా రబీ సీజన్లో గోదావరిలో సహ జ జలాల లభ్యత 36 టీఎంసీలకు పైగా ఉంది. గత రబీసీజన్లో అప్పటి వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్నారు. అప్పట్లో మార్చి నెలాఖరు నాటికి ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 5.50 అడుగుల కు పడిపోయింది. పాండ్లో నీరు డెల్టా కాలువలకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాయకులు,అధికారుల సమన్వయంతో రబీకి సమృద్ధిగా సాగునీరందించారు.

# మద్యం లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా

కొత్తపట్టిసీమ (చైతన్యరథం): మండలంలోని కొత్త పట్టిసీమ వద్ద బుధవారం మద్యం లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ బోల్తాపడింది. కొవ్వూరు వైపు నుంచి పోలవరం మద్యం లోడుతో వస్తున్న వాహనం పట్టిసీమ ఇసుక ర్యాంపు సమీపంలో మలుపు వద్ద బోల్తాపడడంతో మద్యం సీసాల బాక్సులు నేలపాలయ్యాయి. కొన్ని మద్యం సీసాలు, బీరు కేసులు పగిలి పోయాయి. మద్యం షాపు నిర్వాహకులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన సీసాలను మరో వాహనంలో తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, రూ.7 లక్షల విలువైన మద్యం లోడులో 30శాతం నష్టపోయినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు.

## జాబ్ మేళా క్యాలెండర్-2025 ఆవిష్కరించిన ఎంపి కేశినేని, ఎమ్మెల్యే వసంత



విజయవాడ (చైతన్యరథం): ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగం పొందడంతో పాటు మరొకరి ఉద్యోగ అవకాశం కల్పించే స్థాయికి యువత ఎదగాలని ఎంపి కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి.ఆర్.డి.ఎ – సీడాప్ సంయుక్తంగా 2025 సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించనున్న జాబ్ మేళాల తేదీలు, నిర్వహించే ప్రదేశాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జాబ్ మేళాను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని "నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్.ఐ.ఆర్.డి ప్రొగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎ.ఎన్.వి.నాంచారరావు, డిస్ట్రిక్ ఎంప్లామెంట్ ఆఫీసర్ వై.ఎస్.బ్రహ్మం, ఎన్టీఆర్ జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డి.ఎస్.డి.వో) ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఎ.డి.ఎస్.డి.వో దుర్గాప్రసాద్, సిడాప్ జె.డి.ఎమ్ (జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్) సుమలత పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితుల్ని పరామర్శించిన మాజీమంత్రి ప్రత్తిపాటి

●పనిప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలని బాధితులకు సూచన

●ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసా



చిలకలూరిపేట (చైతన్యరథం): పట్టణంలోని భావనారుషి నగర్లోని హోటల్లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితుడు చిన్నం ఆదిబాబుని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించారు. భాధితుడితో మాట్లాడి అతనికి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన మాజీమంత్రి .. ప్రమాదతీరుని అడిగి తెలుసుకున్నారు. ఆదిబాబుకి మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా చూడాలని ప్రత్తిపాటి వైద్యులకు సూచించారు. ప్రభుత్వం తరుపున సాయం అందేలా చూస్తామని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం, ఇళ్లలో విశ్రాంతి తీసుకుంటున్న బాధితుల్ని కలిసిన ప్రత్తిపాటి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాలిన గాయాలు బాధిస్తాయని, జాగ్రత్తగా ఉండాలని ఆహారనియమాలు పాటించాలని ప్రత్తిపాటి వారికి సూచించారు. ప్రమాదతీరుపై బాధితుల్ని అడిగి ప్రత్తిపాటి వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ లీకేజీ వల్లే ప్రమాదం జరిగిందని వారు మాజీమంత్రికి చెప్పారు. పని ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎండలు అధికంగా ఉన్నందున వంటచేసేటప్పుడు, పొయ్యిలవద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాటి వారికి సూచించారు. అగ్నిప్రమాద బాధితులైన పూజ శ్రీనివాసరావు, సీతారావమ్మ, ప్రగడ జాలయ్య, వెంకటరమణ, కోటేశ్వరరావులతో మాట్లాడిన ప్రత్తిపాటి, అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు సూచించారు. మాజీమంత్రి వెంట నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, ఇనగంటి జగదీష్, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన హాజీ షేక్ హసన్ బాషా



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర హజ్ కమిటి ఛైర్మన్‌గా నియమించడం పట్ల హాజి షేక్ హసన్ బాష ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. హజ్ కమిటి ఛైర్మన్‌గా నియమించినందుకు గౌరవప్రదంగా ముఖ్యమంత్రిని కలిశారు. గత బుధవారం సెక్రటరి ఆఫీసులో సీఎంను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... హజ్ కమిటి ఛైర్మన్‌గా బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మీరు సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తారని మాకు మీ మీద నమ్మకం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసినవారికి తప్పక న్యాయం జరుగుతుందని చెప్పారు. పార్టీలో సుదీర్ఘ కాలంగా మీరు పనిచేసిన గుర్తింపుకు ఫలితంగా మీకు ఒక మంచి పదవి ఇచ్చామని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేసిన మీకు సముచిత స్థానం కల్పించామన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తెలుగుదేశంపార్టీకి కీర్తి ప్రతిష్టలు పెంచుతానని హాజీ హసన్ బాష అన్నారు. ప్రతియేట హజ్ యాత్రకు సోదర సోదరీమణులు అధికసంఖ్యలో సౌదీ అరేబియాకు వెళ్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకునేందుకు తనవంతు కృషి చేస్తానని హసన్ బాష అన్నారు. ముస్లింల భవిష్యత్తుకు చంద్రబాబు సువర్ణ అవకాశాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి హాజీ హసన్ బాష ధన్యవాదాలు తెలిపారు.

## అభివృద్ధి మార్క్ ఎలా ఉంటుందో చూపిస్తా : ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేసి, తన పనితనంతో ఎన్డీయే కూటమి అభివృద్ధి మార్క్ చూపిస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు. గురువారం గుంటూరు 38వ డివిజన్ బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ రిటైనింగ్ వాల్‌కు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. అనంతరం పార్కులో కలియ తిరిగి వాకర్స్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అన్నమయ్య పార్కును గతంలో సందర్శించడం జరిగింది. ఈ క్రమంలో పార్క్‌కు రిటైనింగ్ వాల్ అవసరం ఉందని పార్క్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిశీలించి ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.50 లక్షలతో అంచనాలు రూపొందించి నేడు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. రాబోయే 2,3 నెలల్లోనే ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని, ఈ పార్కులో మంచి నీటిని నింపితే సుందరంగా ఉండడంతో పాటు, తమ ప్రాంతాలో భూగర్భ జలాలు పెరుగుతాయని, అలాగే వెంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవం నిర్వహించుకోవటానికి బాగుంటుంది పలువురు తనకు విజ్ఞప్తి చేశారని, అయితే దీని సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రారంభించటానికి ప్రభుత్వంతో పాటు ప్రజల సహాయ సహకారాలు ఉంటే పని త్వరగా పూర్తి అవుతుందని, దాతలు ముందుకు వస్తే, మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో అన్నమయ్య పార్కును అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానం పద్మ శ్రీ, మానం శ్రీనివాస్, వేములపల్లి విఠల్, మాకినేని సాంబశివరావు మరియు పార్క్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు

●ఎంపీ నిధులతో నిర్మించే రోడ్ల పనులను సైతం వైసీపీ అడ్డుకుంది

●5వ డివిజన్‌లో రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి 11 అసెంబ్లీ సీట్లతో ప్రజలు సరిపెట్టి అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ హోదాను కూడా ఇవ్వలేదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. కూటమి పార్టీలకు పూర్తి మద్దతు తెలిపి భారీ మెజార్టీని ప్రజలు అందించారన్నారు. ఈ డివిజన్‌లో గతంలో రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర తన ఎంపీ నిధుల నుంచి రెండు రోడ్ల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశారని, టీడీపీకి చెందిన వారు ఈ ప్రాంతంలో ఉన్నారనే కారణంతో ఈ రోడ్ల నిర్మాణ పనులు చేయనీయకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. ఇలాంటి నీచమైన పనులు చేయబట్టే వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ ఎల్ఐసీ కాలనీ రోడ్డు నెంబరు 3,4 ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.29 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రహదారుల పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో నియోజకవర్గంలోని చాలా రహదారులకు శంకుస్థాపనలు చేశామని వాటిలో చాలా పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఈ డివిజన్‌లోని రెండు రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర తన ఎంపీ నిధులను కేటాయించారన్నారు. ఎంపీ నిధులతో చేపట్టిన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు కూడా త్వరగా ముందుకు వస్తారని చెప్పారు. టీడీపీకి చెందిన వారు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఈ పనులు చేయనీయకుండా రాక్షస మనస్థత్వంతో వైసీపీకి చెందిన వారు అడ్డుకున్నారని చెప్పారు. రాష్ట్రం మొత్తం అదే విధంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగిందన్నారు. అందువల్లనే ప్రజలు కూడా ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 ఎమ్మెల్యే సీట్లతో సరిపెట్టారని అన్నారు. కాని తనకు ప్రతిపక్ష హోదా కావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టుపడుతున్నారని, చట్టం గురించి తెలుసుకునే ప్రయత్నం కూడా ఆయన చేయడం లేదన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్‌లు సమానంగా నిధులను కేటాయించారన్నారు. విజయవాడ నగరానికి ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకుని రావాలని, అందుకు ఎన్ని కోట్ల రూపాయలు అయినా కేటాయించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

## గురుకులాల్లో విద్యా ప్రమాణాలు పెంచండి: చీఫ్ విప్ జీవి



వినుకొండ (చైతన్యరథం): ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ లలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండలోని కార్యాలయంలో గురువారం కేజీబీవీ, మోడల్స్ స్కూల్, మరియు రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల ప్రిన్సిపాల్‌లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000కి 970 మార్కులు సాధించిన చీకటి గల పాలెం మోడల్ స్కూల్ విద్యార్థి పమ్మి కీర్తనను చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అభినందించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, మంత్రి లోకేష్ ఆశయాల ప్రకారం ప్రాథమిక విద్య నుండి విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, విలువలతో కూడిన విద్యను అందించాలని చీఫ్ విప్ జీవి అన్నారు.

# నిరూపించే దమ్ము లేకే భూమన రాజకీయ డ్రామాలు!

- గోశాలలో మరణాలపై సవాల్‌ను స్వీకరించలేని భూమనకు నిజాయితీ లేదు
- రోజా తీరుపై మహిళలు సైతం అసహ్యించుకుంటున్నారు
- ప్రజల ముందు పరువు పోతుందనే భయంతోనే రోడ్డుపై భూమన డ్రామాలు
- భూమన కరుణాకర్ రెడ్డి, రోజా తీరుపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్



మడకశిర (చైతన్యరథం): టీటీడీ గోశాలలో గోవులు మరణించాయని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్న వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి దమ్ముంటే గోశాలకు వచ్చి నిరూపించాలని సవాల్ విసిరితే... నిరూపించే దమ్ము లేక రోడ్డు మీద పడుకుని రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు మండిపడ్డారు. మేం విసిరిన సవాళ్లు నిజాయితీగా గోశాలకు రమ్మంటే.. గృహనిర్బంధం చేశారంటూ డ్రామాలు వేస్తున్నావు సిగ్గుందా నీకు అంటూ ఓ రేంజ్‌లో భూమనపై  ఫైర్ అయ్యారు. సాక్షాత్తు రాష్ట్ర హోంమంత్రి, జిల్లా ఎస్పీ ఏ ఒక్క వైసిపి కార్యకర్తను గృహనిర్బంధం చేయలేదని బహిరంగంగా చెబుతుంటే గోశాలకు వచ్చే దమ్ము లేక నాటకాలు ఆడుతున్నావు అంటూ భూమనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.  గోశాలకు వస్తే వాస్తవాలు బయటికి వస్తాయని, తాను చేసిన ఆరోపణలు అబద్ధాలని ప్రజల ముందు బయటపడుతుందని భూమన భయపడ్డారని ఎద్దేవా చేశారు. గతంలో ఇదే భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉండి... కొండపై నల్లరాతి విగ్రహం ఉందని, దానిని పెకిలివేస్తానని, చెప్పుల దండ వేస్తానని భక్తి లేకుండా మాట్లాడిన దుర్మార్గుడు అంటూ ఎం.ఎస్. రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.  సగటున నెలకు గోశాలలో 8 నుంచి 12 గోవులు చనిపోతాయని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ద్వారా తెలుస్తుందనేది అందరికీ తెలిసిన వాస్తవం అన్నారు. ప్రపంచంలో లక్షల మంది భక్తులు శ్రీవారిని భక్తితో పూజిస్తే భూమన మాత్రం శ్రీవారిని కేవలం ఆదాయ వనరుగా చూశారని విరుచుకుపడ్డారు. వైకాపా హయాంలో కొంతమంది ఎమ్మెల్యేలు శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ పాల్పడ్డారని,  కొండపైన స్వామి వారి పేరుతో అడ్డంగా దోచుకున్నారని ఎం.ఎస్. రాజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇక బాధ్యతాయుతమైన రాజకీయాల్లో ఉన్న రోజా మహిళలను కించపరిచే విధంగా రోడ్డు మీదకు వచ్చి ఆడంగులు అనే మాట్లాడటం సిగ్గుచేటు అని ఎం.ఎస్. రాజు విమర్శించారు. ఇంట్లో నీ భర్త సెల్వమణిని ఆడంగులు అని పిలిచినట్టుగా రోడ్డుపై కూడా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మహిళలు కూడా అసహ్యించుకునే మహిళ ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క రోజా మాత్రమే అని ఎం.ఎస్. రాజు తీవ్ర విమర్శలు గుప్పించారు.మీ అవినీతి, అరాచక పాలన భరించలేక ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా..ఇంకా బుద్ధి లేకుండా. రాజకీయ ఉనికి కోసం పవిత్రమైన తిరుమల శ్రీవారి పేరుతో నీచమైన కుటిల రాజకీయం చేస్తే ..చివరకు ఆ  దేవుడు కూడా క్షమించడని, ప్రజలు వైకాపా నేతలను తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. తక్షణమే తిరుమల గోశాలలో గోవుల మరణాలు అంటూ ఆరోపణలు చేసి, కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన భూమన కరుణాకర్ రెడ్డి, రోజా వైకాపా నేతలు క్షమాపణ చెప్పాలని మడకశిర ఎమ్మెల్యే, ఎం.ఎస్. రాజు డిమాండ్ చేసారు.

# ఆధ్యాత్మిక నగరిలో ఉద్రిక్తత - గోశాలపై కుట్రలకు చెక్ పెట్టిన కూటమి నేతలు



తిరుపతి (చైతన్యరథం): గోశాల అంశంపై నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో కొంత ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. గోశాలలో అక్రమాలు నిరూపిస్తానంటూ వైఎస్సార్సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి విసిరిన సవాల్‌కు కూటమి నేతలు స్వాగతించారు. కూటమి నేతలు గోశాలకు వచ్చి గంటల తరబడి ఎదురుచూసినా సవాల్ విసిరిన భూమన మాత్రం ముఖం చాటేశారు. తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్యప్రచారాలకు కూటమి నేతలు ముగింపు పలికారు. గోశాలలో అక్రమాలను స్వయంగా నిరూపిస్తానంటూ వైఎస్సార్సీపీ నేతలు సవాల్ విసరగా కూటమి నేతలు సై అన్నారు. ఉదయం 9 గంటలకే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన కూటమి నేతలంతా గోశాల వద్దకు చేరుకున్నారు. భూమన కరుణాకర్‌రెడ్డి కోసం గంటల తరబడి ఎదురు చూశారు. సవాలు, ప్రతిసవాళ్లతో గోశాల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

రోడ్డుపైనే బైఠాయించి నిరనస: ఇరుపక్షాలు ఒకేసారి గోశాల వద్దకు వస్తే ఉద్రిక్తత తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు కూటమి నేతలు వెళ్లాక రావాలని కరుణాకర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ గోశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన భూమనను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన రోడ్డుపైనే బైఠాయించి నిరనస తెలిపారు. కూటమి నేతల సూచనలతో పోలీసులు కరుణాకర్ రెడ్డితో చర్చించి గోశాలకు వెళ్లాలని సూచించినా ఆయన వెనకడుగు వేశారు. కుమారుడు అభినయ్ రెడ్డితోపాటు తిరుపతి ఎంపీ గురుమూర్తిని గోశాలకు పంపారు. గత ఐదేళ్లలో గోశాలలో చోటుచేసుకున్న అక్రమాలపై టీటీడీ విజిలెన్స్ నివేదికలను ఎంపీ గురుమూర్తి ముందు ఉంచి వాటికి సమాధానం చెప్పాలంటూ కూటమి నేతలు నిలదీశారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తెల్లముఖం వేసిన ఎంపీ గురుమూర్తి మెల్లగా అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇప్పటికైనా గోశాలపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని కూటమి నేతలు హితవు పలికారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి వైఎస్సార్సీపీ రాజకీయ లబ్ధిపొందాలని ప్రయత్నిస్తోందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కూటమి నేతలు సూచించారు.

# కడపలో భారీగా పట్టుబడిన బంగారం

కడప జిల్లాలో భారీగా బంగారం పట్టుబడింది. 18 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.15 కోట్లకుపైగా ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రొద్దుటూరు రామేశ్వరం బైపాస్ రోడ్డులో ఇవాళ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రి వైపునకు వెళ్తున్న కారును పోలీసులు చెక్ చేశారు. అందులో బంగారు అభరణాలను వారు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆదాయపన్నుశాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో వాటి విలువను లెక్కించారు. అవన్నీ హైదరాబాద్‌లోని ఓ జ్యువెలరీ షాప్‌కి చెందినవిగా నిర్ధారించారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించండి

- కనిగిరి రిజర్వాయర్ షట్టర్లకు మరమత్తులు చేసి నీటి వృథాను అరికట్టండి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (చైతన్యరథం): ఖరీఫ్ సీజన్‌లో కోవూరు రైతులు 500 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. జిలా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... 1 లక్షా 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే సదరన్ ఛానల్, ఈస్టర్న్ ఛానల్ మరియు పైడేరు ఎస్కేప్ ఛానళ్ల షట్టర్లకు మరమత్తులు చేసి నీటి వృదాను అరికట్టాలని కోరారు. వ్యవసాయ రంగంలో నీరు పొదుపుగా వినియోగించాలన్నా.. నీటి దుర్వినియోగం అరికట్టాలన్నా.. క్షేత్ర స్థాయిలో నీటి పంపిణి చేసే లష్కర్ల వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం వుందన్నారు. గత కోనేళ్ళుగా పెండింగ్‌లో వున్న లష్కర్ల జీత భత్యాలు బకాయిలు సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. గత ఆరేళ్లుగా ఆలనా పాలన లేక అస్తవ్యస్తమైన సాగునీటి రంగంలో నీటి సంఘాల ఎన్నికలు జరిపి సాగునీటి పంపిణీలో జవాబుదారితనానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికయ్యాక తొలిసారిగా జిలా సాగునీటి సలహా మండలి సమావేశమై విచ్చేసిన ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, సాగునీటి సంఘ అధ్యక్షులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శుభాకాంక్షలు తెలియచేసారు.

పెన్నా డెల్టా పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో 1 లక్షా 90 వేల 3 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించిన కోవూరు రైతాంగానికి ఆమె అభినందించారు. కనిగిరి రిజర్వాయర్ ప్రధాన గేట్లు పూర్తిగా పాడైపోయాయని వీలైనంత త్వరగా మరమత్తులు చేయించే దిశగా ప్రయత్నించాలని కోరారు. కనిగిరి రిజర్వాయర్ మరియు జాఫర్ సాహెబ్ కాలువ పరిధిలో రబి సీజన్లో సాగు చేసే దాదాపుగా 1 లక్షా 30 వేల ఎకరాలలో ఆయకట్టు చివరి ఎకరా వరకు సాగునీరు అందించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు మరియు రైతులతో సమన్వయం చేసుకొని ప్రణాళికా బద్ధంగా నీటి పంపిణి చేసి నీటి వృదాను అరికట్టడంతో పాటు చివరి ఆయకట్టు వరకు నీరు అందించి అధిక దిగుబడి సాధించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఇరిగేషన్ ఎస్ ఇ దేశీనాయక్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఛైర్మన్ కేశవచౌదరి పాల్గొన్నారు.

# పీఎం ఇంటర్న్‌షిప్‌కు నమోదు చేసుకోండి

- జిల్లా యువతకు ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి



నెల్లూరు (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం(పీఎంఐఎస్)ను జిల్లా యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ సూచన మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటికే గడువు ముగియగా.. మరోసారి గడువు పెంచారని, ఈ నెల 22 వరకు అవకాశం ఉందన్నారు. ఈ పథకానికి 21 -24 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత అర్హులని, దరఖాస్తుదారులు కనీసం పదో తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని అత్యుత్తమ 500 కంపెనీలలో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అద్భుత అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.pminternship.mc.gov.in ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో, యువతకు ప్రతి నెలా రూ.5,000 స్టైపెండ్‌గా అందజేస్తారని, అంతేకాకుండా, పథకం ప్రారంభంలో వారిని ప్రోత్సహించడానికి ఒకేసారి రూ.6,000 ప్రత్యేక ప్రోత్సాహక నిధిని కూడా అందిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1126 మంది నమోదు చేసుకున్నారని, మిగతావారు కూడా త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ సదావకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## పుట్టపర్తిలో టీడీపీ జిల్లా కార్యాలయాన్ని పరిశీలించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు అంజినప్పలు పరిశీలించారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో టీడీపీ కార్యాలయం పుట్టపర్తి సమీపంలోని మామిళ్ళ కుంట సమీపంలో నూతన కార్యాలయం రూపుదిద్దుకుంది. నూతన కార్యాలయాన్ని గురువారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. కార్యాలయంలో ఫర్నిచర్‌తో పాటు ఫ్యాన్లు, కుర్చీలు తగినన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అతి త్వరలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, జిల్లా మంత్రులు, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

## దళితుల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

**•ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు**



రాప్తాడు (చైతన్యరథం): దళితుల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నది మరోసారి నిరూపితమైందని రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. అనంతపురంలోని పరిటాల సునీతమ్మ కార్యాలయంలో వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. దళితులు ఎన్నో ఏళ్లుగా కన్న కల సాకరమవుతోందన్నారు. దీని కోసం గత 30ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నామన్నారు. 2000వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ చేశారని గుర్తు చేశారు. అయితే కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లడం వల్ల అది ఆచరణ సాధ్యం కాలేదన్నారు. కానీ ఈరోజు 24 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోనే ఎస్సీ వర్గీకరణ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం లభించడం పట్ల యావత్ మాదిగలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం, గ్రూపు-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని.. దీని వలన ఇప్పటి వరకు నష్టపోయిన ఎంతో మందికి న్యాయం జరుగుతుందన్నారు. అలాగే త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా చూస్తామని చెప్పడం.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు దళితుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు.

## ఇంటి పట్టాల కోసం స్థల సేకరణను వేగవంతం చేయండి



రాప్తాడు (చైతన్యరథం): అనంతపురం రూరల్ మండల పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు స్థల సేకరణను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ మోహన్ కుమార్ తో పాటు హౌసింగ్ డీఈతో ఆమె తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రూరల్ మండల పరిధిలో ఇళ్ల స్థలాలు లేని వారు ఎంత మంది ఉన్నారు. వారికి ఎంత మేర స్థలం అవసరం అన్నది ఆరా తీశారు. అయితే గతంలో పలు హౌసింగ్ లేఅవుట్లలో కొందరు ఎలాంటి అర్హత లేకున్నా.. స్థానికంగా లేకున్నా ఇళ్ల పట్టాలు తీసుకున్నారని, వారిలో కొందరు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి వాటిని గుర్తించి ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామన్నారు. దీంతో పాటు పలు గ్రామాల పరిధిలో మొత్తం 30ఎకరాల వరకు సేకరించినట్టు వివరించారు. గత ప్రభుత్వంలో స్థల సేకరణ చేసి.. వివాదాల్లో ఉన్న వాటిని కూడా క్లియర్ చేయాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. ఇంకా ఎంత మేర సేకరణకు అవకాశం ఉందన్నది చూడాలన్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలోనే ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని.. అందుకను గుణంగా స్థలం ఉండాలన్నారు.

## ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం... సామాజిక న్యాయానికి చారిత్రాత్మక ముందడుగు

**•శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



శింగనమల (చైతన్యరథం): ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం సామాజిక న్యాయానికి చారిత్రాత్మక ముందడుగు అని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం సామాజిక న్యాయ సాధనలో ఒక చారిత్రాత్మక మైలురాయి అని అభివర్ణించారు. దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాడుతున్న దళిత వర్గాల ఆకాంక్షలకు తీరుదల లభించిందని ఆమె తెలిపారు."ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా, మంత్రుల కమిటీ సిఫారసులతో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. 200 పాయింట్ల రోస్టర్ విధానం ప్రకారం రిజర్వేషన్లు సమానంగా పొందేలా చర్యలు చేపట్టడమే ఇందుకు నిదర్శనం," అని అన్నారు. ఈ వర్గీకరణలో భాగంగా గ్రూప్-1కి 1శాతం, గ్రూప్-2కి 6.5 శాతం, గ్రూప్-3కి 7.5 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు, తద్వారా అన్ని ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. "రాబోయే డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. ఇది విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చూపిన సంకల్పానికి నిదర్శనం," అని శ్రావణి శ్రీ పేర్కొన్నారు. "మాల, మాదిగ, ఇతర ఉపకులాల మధ్య న్యాయం చేయాలన్న దీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారానికి ఈ నిర్ణయం బీజం వేస్తుంది. ఇది దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే నిర్ణయం. ప్రజలందరూ దీనిని స్వాగతించాలి," అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఎస్సీ సామాజికవర్గం ఎప్పటికీ సీఎం చంద్రబాబుని మర్చిపోదు

**•దళిత జాతి మొత్తం ఆయనకు రుణపడి ఉంటుంది**

**•ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ ఆమోదంపై అనంతపురం అర్బన్ టీడీపీ సెల్ నాయకుల హర్షం**



అనంతపురం (చైతన్యరథం): ఎస్సీ సామాజిక వర్గం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎప్పటికీ రుణపడి ఉంటుందని అనంతపురం అర్బన్ టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో వారు అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముందుగా క్యాబినెట్‌లో ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహా, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేష్‌లు మాట్లాడుతూ... దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనేనన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి నిరూపించారన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం, గ్రూపు-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని అలాగే త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా చూస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపడంలో సీఎం చంద్రబాబు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. 30ఏళ్లగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ మొదలు పెట్టిన ఈ పోరాటానికి 2001లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాణం పోశారన్నారు. అప్పట్లోనే వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఆతర్వాత జరిగిన పరిణామాలతో సుప్రీం కోర్టులో వర్గీకరణ వ్యతిరేకిస్తూ వేసిన కేసు వల్ల ఇది ఆగిపోయిందని ఇప్పుడు తాజాగా 2025లో మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయకుడు ఆధ్వర్యంలోనే అమలవడం సంతోషంగా ఉందన్నారు. జనాభా వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్లను ఉపకులాల వారీగా వర్గింపజేయాని సిఫారసు ఉందని రోస్టర్‌లో 200 పాయింట్ల విధానం ప్రకారం మొదటి 100 పోస్టుల్లో రెల్లి ఉపకులాలకు 1, మాదిగ ఉపకులాలకు 6, మాల ఉపకులాలకు 8 చొప్పున పోస్టులు వస్తాయన్నారు. రెండో 100 పోస్టుల్లో రెల్లి ఉపకులాలకు 1, మాదిగ ఉపకులాలకు 7, మాల ఉపకులాలకు 7 చొప్పున పోస్టులు వస్తాయన్నారు. దీనివల్ల రోస్టర్ లో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మా ఎస్సీ సామాజిక వర్గం పై చూపిన చొరవను ఎప్పటికీ మరువలేమన్నారు. ఎప్పటికీ మేమంతా ఆయన వెంటే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శివ, తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఋషివర్ధన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సమన్యాయం కూటమితోనే సాధ్యం

**•ఎస్సీ వర్గీకరణ ఆ వర్గాలకు ఎంతో మేలు చేస్తుంది: ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు**

పత్తికొండ (చైతన్యరథం): రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కె.ఈ .శ్యామ్ కుమార్ అన్నారు. గురువారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల తిరుపాలుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం మొదలైన రోజే వర్గీకరణకు తన వంతు సహకారం అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు వర్గీకరణ ఆయన హయంలోనే చేశారన్నారు. గత వైసీపీ హాయంలో రాష్ట్రం అన్ని రకాలుగా వెనుకబాటుకు గురైందని రేషన్ గుంతలు పడ్డ రోడ్లకు గంపెడు మట్టి కూడా వేయని దుస్థితిలో పాలన సాగింది అన్నారు. దీంతో చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు టీడీపీకి పట్టం కట్టారన్నారు. అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులు మరమ్మతులు చేశారని. గ్రామ గ్రామాన సీసీ రహదారులు ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపుదల ఉచిత గ్యాస్ సిలిండర్‌లో అందించారన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు పాలనలో రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రామానాయుడు. ఎస్సీ సెల్ నాయకులు బోనాల కాశి హొసూరు అంజి, ఉచ్చిరప్ప కడవల సుధాకర్, రాంపల్లి తిరుపాలు, హోటల్ సుధా, శ్రీనివాసులు గౌడ్, జగ్గిలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# వక్ఫ్ చట్టంపై విచారణ.. స్టే కు సుప్రీం నిరాకరణ

- కౌంటర్ దాఖలుకు కేంద్రానికి వారం గడువు
- తదుపరి విచారణ మే 5కు వాయిదా



న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం-2025 రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా వక్ఫ్‌పై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అయితే, అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు మే 5కు వాయిదా వేసింది.

వక్ఫ్ చట్టంలోని కొన్ని అంశాలపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామని బుధవారం సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ చట్టంలో కొన్ని సెక్షన్లను మాత్రమే చదివి నిర్ణయం తీసుకోవద్దని ధర్మాసనాన్ని కోరారు. ఈ విషయంలో అనేక సవరణలు, కమిటీల ఏర్పాట్లు, లక్షల సంఖ్యలో అభ్యర్థనలు ఉన్నాయని గుర్తు చేశారు. గ్రామాలకు గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగానూ, వ్యక్తిగత ఆస్తులనూ తీసుకున్నారని వివరించారు. ఇది ప్రజలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ స్టే ఇవ్వడం కఠినమైన నిర్ణయం అని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తనకు ఒక వారం సమయం ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. అలాగే తన వాదనలతో పాటు డాక్యుమెంట్లను సమర్పించడానికి సైతం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకొని .. తదుపరి విచారణ వరకు వక్ఫ్ కౌన్సిల్లో ఎలాంటి నియామకాలు జరగకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిపై తుషార్ మెహతా స్పందిస్తూ.. ఏ రాష్ట్రం అయినా.. నియామకాలు చేస్తే.. అవి చట్టబద్ధమైనవిగా పరిగణించకూడదన్నారు. దీంతో కౌంటర్ దాఖలు చేయడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం వారం రోజులు సమయం ఇచ్చింది. ఇక తదుపరి విచారణ తేదీ వరకు.. యూజర్ బై వక్ఫ్‌గా పేర్కొన్నవాటితోపాటు నోటిఫికేన్ ద్వారా రిజిస్టర్ అయిన ఆస్తులు.. డీ నోటిఫై చేయకూడదంటూ సుప్రీ కోర్టు ఆదేశించింది. అంత వరకు వక్ఫ్ ఆస్తుల్లో ఎటువంటి మార్పులు చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.ఇక వక్ఫ్ సవరణ చట్టంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై వారం రోజుల్లో వివరణాత్మక సమాధానం ఇవ్వాలని కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించింది.

ఇవే పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా వక్ఫ్ న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను ప్రస్తుతానికి వక్ఫ్ జాబితా నుంచి తొలగించకూడదని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో.. ఎక్స్-అఫీషియో సభ్యులు మినహా మిగతా సభ్యులంతా కచ్చితంగా ముస్లింలే అయ్యుండాలనీ సూచించింది. మతంతో సంబంధం లేకుండా ఎక్స్-అఫీషియో సభ్యులను నియమించొచ్చని పేర్కొంది.

# పీఓకేను ఖాళీ చేయాల్సిందే

## - పాక్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్



న్యూఢిల్లీ:ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్థాన్ ఎప్పటికైనా ఖాళీ చేయాల్సిందేనని భారత్ స్పష్టం చేసింది. కాశ్మీర్ గురించి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ చేసిన వ్యాఖ్యలను భారత ప్రభుత్వం గట్టిగా తిప్పికొట్టింది. చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భూభాగాన్ని ఖాళీ చేయడమే కాశ్మీర్‌తో దాయాదికి మిగిలి ఉన్న సంబంధమని స్పష్టం చేసింది. విదేశీ భూభాగం పాకిస్థాన్ జీవనాడి ఎలా అవుతుంది.. ఆక్రమిత కాశ్మీర్ ముమ్మాటికీ భారత భూభాగామే తేల్చిచెప్పింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణదీర్ జైస్వాల్ గురువారం మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మాట్లాడుతూ.. కాశ్మీర్ విషయంలో మా వైఖరి సరైనది. ఆ ప్రాంతం మా జీవనాడి దానిని మేం మర్చిపోలేం అని వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే భారత్ స్పందన వచ్చింది. ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా పాకిస్థాన్ గడించిన ఖ్యాతి.. ఆ దేశం ఎంత ప్రయత్నించినా పోదు. ఉగ్రదాడులకు పాల్పడినవారిని ఆ దేశం ఇప్పటికీ కాపాడుతోందని జైస్వాల్ తప్పుబట్టారు.

కాశ్మీర్ అంశంలో మనదేశం ఎప్పటికప్పుడు తన వైఖరిని బలంగా వినిపిస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని గతంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పొరుగుదేశం అక్కడ ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నడిపిస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్‌కు పీవోకే విదేశీ భూభాగం అవుతుందే తప్ప మరొకటి కాదని అన్నారు. అందుకే ఆ ప్రాంతంలో ఉగ్రవాద వ్యాపారాన్ని సాగిస్తోందన్నారు.

ఇటీవల ఐరాస వేదికగా భారత్ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితిలో శాంతి పరిరక్షణ సంస్కరణలపై జరుగుతున్న చర్చల్లో జమ్మూకశ్మీర్‌పై అనవసర ప్రస్తావన తీసుకొచ్చిన దాయాదికి భారత్ గట్టిగా చురకలంటించింది. భారత కేంద్రపాలిత ప్రాంతమైన కాశ్మీర్‌పై పాకిస్థాన్ ప్రతినిధి మరోసారి అనవసర వ్యాఖ్యలు చేశారు. ఇలా పదేపదే ఈ అంశాన్ని లేవనెత్తడం వల్ల వారు చేసే చట్టవిరుద్ధ వాదనలు నిజమైపోవు.. ఇలాంటి ప్రయత్నాలతో వారు ప్రోత్సహిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరు. జమ్మూకాశ్మీర్ ఇప్పటికీ, ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగామే. ఈ ప్రాంతంలోని కొంత భూభాగం ఇప్పటికీ పాక్ ఆక్రమణలోనే ఉంది. దాన్ని ఖాళీ చేయాల్సిందే అని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ హితవు పలికారు.

# రాష్ట్రపతిని కోర్టులు నిర్దేశించలేవు: ఉప రాష్ట్రపతి



న్యూఢిల్లీ: రాష్ట్రపతిని కోర్టులు నిర్దేశించజాలవని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను ఆమోదించడానికి గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు. రాజ్యసభ ఇంటర్న్‌స్ 6వ బ్యాచ్‌ను ఉద్దేశించి గురువారం ప్రసంగించిన ఆయన కోర్టులు.. రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి ఉండకూడదన్నారు. ఇలా ఉండగా, ఈ నెల 13వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో..రాష్ట్రాల గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి తప్పనిసరిగా 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని తొలిసారిగా గడువును నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి కూడా జ్యుడీషియల్ రివ్యూకు కట్టుబడి ఉండాలని ఆ తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో పాస్ అయిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌తో కూడిన బెంచ్ ఈమేరకు సంచలన తీర్పును వెలువరించింది.

# వారిని కొంతకాలం ఉద్యోగాల నుంచి తొలగించొద్దు

## - పశ్చిమ బెంగాల్లో కొందరు టీచర్లకు ఊరట

న్యూఢిల్లీ: ఉద్యోగాల తొలగింపు నుంచి పశ్చిమబెంగాల్‌లో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లుబాటు కాదంటూ ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంలో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. నియామక ప్రక్రియ ద్వారా ఎంపికై, ఎలాంటి ఆరోపణలు లేని, 9-12 తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కొనసాగించడానికి అనుమతించింది. కొత్త నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు బోధన కొనసాగించొచ్చని చెప్పింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు గడువు విధిస్తూ మే 31లోగా కొత్త రిక్రూట్మెంట్ డ్రైవ్ కోసం ప్రకటన ఇవ్వాలని ఆదేశించింది. అలాగే ఎంపిక ప్రక్రియ డిసెంబర్ 31లోగా పూర్తికావాలని స్పష్టంచేసింది. "దీనికి సంబంధించి మే 31లోగా రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాలు జారీ చేశారు. ఇక ఈ స్వల్ప ఊరట గ్రూప్-సి, గ్రూప్-డి ఉద్యోగులకు వర్తించదు. టీచర్ల నియామకాన్ని రద్దు చేస్తూ ఈనెల మొదట్లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో పలు పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందంటూ బెంగాల్ ప్రభుత్వం పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

# 11 ఏళ్ల బధిర బాలికపై అత్యాచారం

**ఉత్తరప్రదేశ్‌లో దారుణం**

రాంపూర్: ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్లో దారుణం చోటుచేసుకుంది. 11 ఏళ్ల బధిర బాలికపై ఓ కీచకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. మూగ, చెవిటి అయిన ఆ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా.. దారుణంగా కొట్టి హింసించాడు. పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై తుపాకితో కాల్పులు జరిపాడు. పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో అతడి తొడలో బుల్లెట్ దిగింది. అతడిని స్టేషన్‌కు ఈడ్చుకెళ్లారు. పోలీసులు, బాధితురాలి కుటుంబం చెప్పిన వివరాల మేరకు.. బాలిక కనిపించడం లేదని కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె కోసం కుటుంబసభ్యులు గాలిస్తుండగా.. పొలాల్లో తీవ్ర గాయాలతో, నగ్నంగా కనిపించింది. వెంటనే ఆ బాలికను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో భాగంగా ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. ఈ క్రమంలో దాన్ సింగ్ (24) అనే వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి పొలాల్లోకి తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు అధికారులు ప్రయత్నించగా, అతడు పోలీసుల పైకి కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో నిందితుడి కాలుకి గాయమవడంతో అదుపులోకి తీసుకున్నారు. ఇక, ఆ చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ కీలక విషయాలు వెల్లడించారు. ఒకరు కంటే ఎక్కువమంది బాలికపై అత్యాచారం చేసినట్లు తెలుస్తోందన్నారు. చిన్నారి ముఖంపై బలమైన గాయాలైనట్లు వెల్లడించారు. ఆమె ప్రైవేటు భాగాల పైనా అనేక గాయాలు ఉన్నాయన్నారు. తాను చూసిన అత్యంత ఘోరమైన లైంగిక నేరాల్లో ఇది ఒకటన్నారు.

## మస్క్.. మామూలోడు కాదు
## పొగడ్తలతో ముంచెత్తిన పుతిన్



టెస్లా బాస్, డోజ్ సారథి ఎలాన్ మస్క్‌ను రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ పొగడ్తలతో ముంచెత్తారు. గతంలో సోవియట్ కాలం నాటి రాకెట్ శాస్త్రవేత్త సెర్గీకొరొలోవ్‌తో మస్క్‌ను పోల్చారు. మాస్కోలోని బౌమాన్ యూనివర్శిటీలో విద్యార్థులను ఉద్దేశించి పుతిన్ ప్రసంగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మస్క్‌వంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిస్తారన్నారు. "మీకు తెలుసా.. అమెరికాలో మస్క్ అనే వ్యక్తి ఉన్నాడు. అతడు అంగారక గ్రహం గురించిన కలలను గొప్పగా చెబుతుంటాడు. మానవ జాతిలో ఇలాంటి వారు చాలా అరుదు. అతడి కలలు కొంతకాలం తర్వాత వాస్తవరూపం ధరిస్తాయి. అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఈ రోజున మనకు నమ్మశక్యం కానివి భవిష్యత్తులో నిజాలవుతాయి" అన్నారు.

అంతకుముందు జర్నలిస్ట్ టకర్ కార్ల్‌సన్‌తో మాట్లాడుతూ "ఎలాన్ మస్క్‌కు ఎదురులేదు" అని పుతిన్ వ్యాఖ్యానించారు. 2023 ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరంలో పుతిన్ మాట్లాడుతూ ఎలాన్ ఓ అసాధారణ వ్యక్తి.. ప్రతిభావంతుడైన వ్యాపారవేత్త. ఈ విషయాన్ని ప్రపంచం మొత్తం గుర్తించింది అని పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

**స్టార్ లింక్‌కు రష్యానుంచి ముప్పు..**

ఓవైపు పుతిన్ మస్క్‌ను పొగుడుతున్నా.. మరోవైపు స్టార్‌లింక్ ప్రాజెక్టుకు రష్యానుంచి ముప్పు పొంచి ఉందని సెక్యూర్ వరల్డ్ ఫౌండేషన్ సంస్థ విడుదల చేసిన రిపోర్టులో పేర్కొంది. 316 పేజీల నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఉపగ్రహాలను కూల్చే సామర్థ్యం మొత్తం 12 దేశాలకు ఉన్నట్టు వెల్లడించింది. ఉక్రెయిన్ యుద్ధంలో 2022నుంచి స్టార్ లింక్ వినియోగం మొదలుపెట్టినా.. 2024లో మాత్రం కొన్ని సమస్యలు ఎదురయ్యాయని వెల్లడించింది. రష్యా పరీక్షిస్తున్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్టు వెల్లడించింది.

## ఆర్థిక కష్టాల్లో హమాస్



గాజా మిలిటెంట్ సంస్థ హమాస్ నిధులలేమితో కటకటలాడుతోంది. కనీసం సంస్థలోని సభ్యులకు కూడా చెల్లింపులు చేయలేని స్థితికి చేరింది. ఈ పరిస్థితిని అరబ్ ఇంటెలిజెన్స్ వర్గాలు గ్రహించినట్టు గురువారం వాల్ట్ జర్నల్ కథనం పేర్కొంది. గాజాలోకి వెళ్లే మానవీయ సాయంలో ఇజ్రాయెల్ భారీగా కోత విధించడంతో.. హమాస్ దోచుకొని విక్రయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నది పత్రిక కథనం. దీంతోపాటు సంస్థలో నిధుల పంపిణీకి బాధ్యత వహించేవారిని గుర్తించి మరీ ఇజ్రాయెల్ దళాలు అంతం చేస్తున్నాయి. హమాస్ గాజాకుచేరే మానవీయ సాయాన్ని పక్కదారిపట్టించడం, స్థానిక వ్యాపారులు, ప్రజలపై పన్నులు విధించడంవంటివి చేసి సొమ్ము పోగేసేవి. విదేశీ నగదుతో బయట మానవీయ సాయం కొనుగోలు చేసి గాజాలో అత్యధికధరలకు విక్రయించి లాభపడేది.జనవరిలోకాల్పుల విరమణ వేళగాజాలోకి మానవీయ సాయం, నిధుల పంపిణీ పెరిగింది. కానీ, మార్చినాటికి వీటిని బాగాతగ్గించారు. దీంతో హమాస్ శ్రేణులకు అందే సొమ్ములోనూ భారీ కోత పడింది. వాస్తవానికి ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలు కావడానికి ముందు ప్రతినెలా దాదాపు 15 మిలియన్ డాలర్లు ఖతార్‌నుంచి లభించేవి. దీంతోపాటు ఏటా 500 మిలియన్ డాలర్లు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నిధుల రూపంలో వచ్చేవి. గాజాలో పోరు మొదలయ్యాక నిధుల రాక బాగా కష్టతరంగా మారింది. అమెరికా ఆంక్షలు కూడా కారణంగా నిలిచాయి. యుద్ధం ప్రారంభంలో బ్యాంక్ ఆఫ్ పాలస్తీనా శాఖలనుంచి 180 మిలియన్ డాలర్లు తీసుకొన్నట్టు అక్కడి అధికారులు చెబుతున్నారు.

## గంపెడు పిల్లల తండ్రి మస్క్!



జననాల రేటు పడిపోతే మానవాళికి ప్రమాదమనే భావనతో ఎక్కువమంది పిల్లల్ని కనాలని పిలుపునిస్తుంటారు ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్. ఈ మాట తాను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. ఇప్పటికే 14మందికి తండ్రి అయిన ఆయన.. తన సంతానాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. తల్లులను ఎంపిక చేసుకునేందుకు ఎక్స్‌వేదికను ఉపయోగించుకుంటున్నారని పేర్కొంది. సరోగసీ ప్రక్రియను వాడుకోవాలనుకుంటున్నారని వెల్లడించింది.ఈమొత్తం ప్రక్రియ కోసం డబ్బు ఆశ చూపుతున్నారని, కఠిన గోప్యతా ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది.

మొదటి భార్య జస్టిన్‌కు జన్మించిన తొలిబిడ్డ అనారోగ్య కారణాలతో 10వారాలకే మృతి చెందింది. తర్వాత ఆ జంట ఐవీఎఫ్ పద్ధతిలో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. 2008లో వారిద్దరూ విడిపోయారు. తర్వాత బ్రిటన్ నటి తాలులాహ్ రిలేను మస్క్ వివాహమాడారు. అయితే వారికి సంతానం లేదు. అనంతరం కెనడియన్ గాయని గ్రిమ్‌తో సంబంధం నెరిపారు. వారికి ముగ్గురు పిల్లలు. అనంతరం తన ప్రతిష్టాత్మక సంస్థ బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న జిలిస్‌తో సహజీవనం చేస్తున్నారు. వీరికి ఇప్పటికే ముగ్గురు పిల్లలుండగా.. ఇటీవల ఈ జంట నాలుగో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ మధ్యలో ఆష్లీ సెయింట్ క్లెయిర్ తాను మస్క్ బిడ్డకు జన్మనిచ్చినట్లు చెప్పింది. ఎక్కువమంది పిల్లలకు జన్మనివ్వాలనుకుంటున్నారని ఆయన నుంచి వచ్చిన సందేశాలను బట్టి అర్థమవుతోందని ఆమె అన్నారు. అయితే ఆయన సంతానం 14 మందికే పరిమితమై ఉండకపోవచ్చని, ఇంకా ఎక్కువమంది పిల్లలే ఉండి ఉంటారని ఆయన సన్నిహితులు వెల్లడించారు.

## ట్రంప్ విధానాలు ముంచేశాయి

**అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్**

భారత్,చైనా సహా పలుదేశాలపై భారీస్థాయి లో సుంకాలతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. దీనివల్ల అగ్రరాజ్య కంపెనీలు, పరిశ్రమల పైనా పెను ప్రభావం పడనుండటంతో ఆయన ఆర్థిక విధానాలపై స్వదేశంలోనూ పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ కూడా విమర్శలు గుప్పించారు. సుంకాల పెంపుతో ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరుకుంటుందన్నారు. ట్రంప్ పాలనలో విధానపరమైన మార్పులు ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ (అమెరికా కేంద్రబ్యాంకు)ను ముంచేశాయని దుయ్యబట్టారు. చికాగోలో జరిగిన ఓ కార్యక్రమంలో పావెల్ మాట్లాడుతూ.. "ట్రంప్ సర్కారు నిర్ణయాలు చాలా ప్రాథమిక విధాన మార్పులు. వీటి గురించి ఎలా ఆలోచించాలో అర్థం కావట్లేదు. ఇప్పటివరకు ప్రకటించిన సుంకాలు.. ఊహించిన దానికంటే చాలా ఎక్కువ. టారిఫ్‌వల్ల నెలకొన్న అనిశ్చితి ఆర్థిక వ్యవస్థకు శాశ్వత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉంది. ఇక, టారిఫ్‌ను ఇలా పెంచుకుంటూ పోవడంవల్ల ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకునే అవకాశం ఉంది.ప్రజలు కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. అటు ఆర్థిక మందగమనం కూడా మొదలవుతుంది" అని అంచనా వేశారు. స్టాక్ మార్కెట్లు కూడా తీవ్ర ఊగిసలాటకు లోనవుతాయని పావెల్ హెచ్చరించారు. ఉపాధి కల్పన, ద్రవ్యోల్బణ నియంత్రణవంటి ఫెడ్ లక్ష్యాలకు ట్రంప్ సుంకాలు ముప్పుగా మారుతున్నాయని విమర్శించారు.

## మనకు టారిఫ్‌లే చాలు..

**ఆదాయపన్ను అవసరం ఉండకపోవచ్చన్న ట్రంప్**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల నుంచి వసూలు చేయనున్న టారిఫ్‌పై భారీ అంచనాలు పెట్టుకొన్నారు. దేశానికి ఈ సొమ్ము లభిస్తే ఇప్పటికే ప్రజల నుంచి వసూలుచేస్తున్న ఆదాయపు పన్ను అవసరం ఇక ఉండబోదని అభిప్రాయ పడ్డారు. తాజాగా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 1870-1913 మధ్యలో అమెరికాలో ఇన్కమ్ ట్యాక్స్ లేదని.. టారిఫ్ ప్రభుత్వ ప్రధాన ఆదాయవనరని వెల్లడించారు. ఆ సమయంలో అమెరికా అత్యంత సంపన్నదేశంగా వర్ధిల్లిందన్నారు. 1880ల్లో మిగులు నిధులు ఖర్చు చేసేందుకు ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశారన్నారు. కానీ, 1913లో ఆదాయపు పన్ను వచ్చాక పరిస్థితి మారిందని చెప్పారు. "టారిఫ్‌నుంచి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అది ఆదాయపు పన్నును భర్తీ చేస్తుంది. ప్రస్తుతం విధిస్తున్న పన్నులతో రోజుకు రెండునుంచి మూడు బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తుంది. గతంలో ఎన్నడూ ఇంత మొత్తం రాలేదు" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. వ్యాపారాలు దెబ్బతినకుండా తాత్కాలికంగా సుంకాలకు విరామం ప్రకటించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం తాను విధిస్తున్న సుంకాలను గ్రేట్ డిప్రెషన్ సమయంతో పోల్చడాన్ని ట్రంప్ కొట్టిపారేశారు. సుంకాల అమలుకు ముందే ఆ పరిస్థితి నెలకొందన్నారు. అమెరికా క్రిమినల్ జస్టిస్‌లో మార్పుల అంశంపై ట్రంప్ స్పందిస్తూ.. ఎల్ సాల్వడార్ ప్రెసిడెంట్ నయాబ్ అనుసరిస్తున్న భద్రతా చర్యలను అభినందించారు. భారీ జైళ్లను నిర్మించడాన్ని మెచ్చుకొన్నారు. అంతేకాదు.. బైడెన్ సమయంలో దేశంలోకి అనుమతించిన నేరగాళ్లను వాటిలోకి పంపిస్తామన్నారు.


## చైనా జలాంతర్గాములతో అలెర్ట్

**హన్‌కుయాంగ్ యుద్ధ విన్యాసాలకు దిగిన తైవాన్**

తైవాన్‌కు అత్యంత సమీపంలో చైనాకు చెందిన శక్తిమంతమైన జలాంతర్గాముల కదలికలు పెరిగాయి. తాజాగా గూగుల్ మ్యాప్స్‌లో ఈవిషయం వెల్లడైంది. తైవాన్ సమీపంలోని చైనానౌకాదళ స్థావరమైన క్వింగ్‌దావ్‌లో కనీసం ఆరుశక్తిమంతమైన జలాంతర్గాములు దర్శనమిచ్చాయి.ఎల్లోసీలో ఉన్న దీనిని చైనా తొలిసబ్‌మెరైన్ బేస్‌గా వ్యవహరిస్తారు.ఈ చిత్రాలను ఆస్ట్రేలియాకు చెందిన నావికదళ నిపుణుడు అలెక్స్ లక్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. జపాన్ సముద్రం, తూర్పు చైనా సముద్రజలాల్లోకి అత్యంత వేగంగా జలాంతర్గాములు ప్రవేశించేందుకు క్వింగ్‌దావ్ స్థావరం అనుకూలం. ఇక్కడ రెండు టైప్ 091, 093ఏ జలాంతర్గాములు నిలుపగా.. మరో గుర్తు తెలియని సబ్మెరైన్ కూడా ఉంది. ప్రస్తుతం దానిని విచ్ఛిన్నం చేస్తుండి ఉంటారని పేర్కొన్నారు. ఇక అదే చిత్రంలో టైప్092 జలాంతర్గామి కూడా కనిపిస్తోంది. దీని స్థానాన్ని సరికొత్త టైప్ 094తో భర్తీ చేయనున్నారు.

**చైనా దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న తైవాన్..**

బీజింగ్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్నవేళ తైవాన్ వార్షిక హన్‌కుయాంగ్ యుద్ధ విన్యాసాలు మొదలుపెట్టింది. ఇవి 14 రోజులపాటు జరగనున్నాయి. 2027లో చైనా ఆక్రమిస్తుందనే అంచనాలను దృష్టిలో పెట్టుకొని వీటిని నిర్వహిస్తున్నట్టు తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ పేర్కొన్నారు. ఈ విన్యాసాల్లో తైవాన్ ఎం1ఏ2టీ ట్యాంక్‌ను, హిమార్స్ రాకెట్ వ్యవస్థ, యాంటీషిప్ మిసైల్ వ్యవస్థలను పరీక్షించడంతోపాటు లైవ్ ఫైర్‌డ్రిల్స్ కూడా నిర్వహించనుంది. ఇటీవల తైవాన్ సమీపంలో రెండ్రోజులపాటు చైనా యుద్ధ విన్యాసాలను నిర్వహించింది. ఈసందర్భంగా తైవాన్‌లోకి చైనా ట్యాంకులు వెళ్లడాన్ని సాధన చేసేలా పెద్దతేలియాడే వంతెనను నిర్మించారు.గతంలో చైనా దళాలు తైవాన్‌లో అడుగుపెట్టడంపై నిపుణుల్లో సందేహాలుండేవి. కానీ,సరికొత్త వంతెన వ్యవస్థ కారణంగా ఇప్పుడు అవి తేలిగ్గా ఆ ద్వీప దేశంలోకి అడుగు పెట్టగలవని చెబుతున్నారు.



# సమష్టిగా రాణించిన ముంబయి బ్యాటర్లు

## ఎస్ఆర్‌హెచ్‌పై 4 వికెట్లతో ఘన విజయం





ముంబయి: ఐపీఎల్ 18లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐదో ఓటమి చవిచూసింది. గత మ్యాచ్‌లో పంజాబ్‌పై 246 పరుగుల లక్ష్యాన్ని అవలీలగా ఛేదించిన ఎస్ఆర్‌హెచ్ ఈ సారి బ్యాటింగ్‌లో తడబడింది. మరో పక్క బ్యాటర్లందరూ తలో చేయివేయటంతో గురువారం రాత్రి సొంత గ్రౌండ్ వాంఖడే స్టేడియంలో సన్ రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంకా 11 బంతులు మిగిలిఉండగానే నాలుగు వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్ గెలుపొందింది. ముంబయి విజయానికి మూడు ఓవర్లలో రెండు పరుగులు అవసరమైన సమయంలో 18 ఓవర్‌లో కొంత డ్రామా చోటు చేసుకుంది. ఇషాన్ మలింగ వేసిన ఆ ఓవర్ తొలి బంతికి తిలక్ వర్మ సింగిల్ తీశాడు. తరువాతి బంతికి హార్దిక్ పాండ్యా (21, 9 బంతుల్లో, 3 ఫోర్లు, ఒక సిక్స్) అవుటయ్యాడు. తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన నమన్ ధీర్ రెండు బంతుల్లో పరుగులేమీ చేయకుండా ఆ తరువాతి బంతికి ఎల్బీగా వెనుతిరిగాడు. మైకేల్ శాంట్నర్ క్రీజులోకి వచ్చినప్పటికీ చివరి బంతికి పరుగు తీయలేకపోయాడు. జీషన్ అన్సారీ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ తొలిబంతికి తిలక్ వర్మ ఫోర్ కొట్టి విజయ లాంఛనం పూర్తి చేశాడు.

163 పరుగుల లక్ష్యఛేదనకు బ్యాటింగుకు దిగిన ముంబయి 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో ర్యాన్ రికెల్టన్ (31), విల్ జాక్స్ (36), రోహిత్ శర్మ (26), సూర్యకుమార్ యాదవ్ (26), హార్దిక్ పాండ్య (21) రాణించారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో కమిన్స్ 9, ఎషాన్ మలింగ 2, హర్షల్ పటేల్ ఒక వికెట్ తీశారు. ముంబయికి ఇది వరుసగా రెండో విజయం.

అంతకు ముందు ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (40, 28 బంతుల్లో 7 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (37, 28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) మాత్రమే రాణించారు. ట్రావిస్ హెడ్ (28, 29 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడలేకపోయాడు. ఇషాన్ కిషన్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగాడు. నితీశ్ కుమార్ రెడ్డి (19) పరుగులు చేశాడు. చివర్లో అనికేత్ వర్మ (18 నాటౌట్: 8 బంతుల్లో 2 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. ముంబయి బౌలర్లలో విల్ జాక్స్ 2, హార్దిక్ పాండ్య, జస్ ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

ఇన్నింగ్స్ తొలి బంతికే జీవదానం అందుకున్న ఓపెనర్ అభిషేక్ దూకుడుగా ఆడాడు. నిలకడగా బౌండరీలు బాదాడు. దీపక్ చాహర్ వేసిన ఐదో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో ఏడు ఓవర్లకు హైదరాబాద్ 53/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ, హార్దిక్ పాండ్య బంతి అందుకున్నప్పటి నుంచి సన్‌రైజర్స్ పరుగుల వేగం నెమ్మదించింది. హార్దిక్.. ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో అభిషేక్ ను వెనక్కి పంపాడు. ఆ వెంటనే విల్ జాక్స్ బౌలింగ్లో లో ఇషాన్ కిషన్ స్టంపౌటయ్యాడు.

ట్రావిస్ హెడ్ క్రీజులో ఉన్నా ధాటిగా బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. హెడ్‌ను జాక్స్ ఔట్ చేశాడు. నితీష్ కూడా దూకుడుగా ఆడలేకపోయాడు. దీంతో 11-16 ఓవర్ల మధ్య 37 పరుగులే వచ్చాయి. 17వ ఓవర్లో నితీష్‌ను బౌల్ట్ పెవిలియన్ కు పంపాడు. దీపక్ చాహర్ వేసిన 18 ఓవర్లో క్లాసెన్ వరుసగా 6, 4, 4, 6 బాదేయడంతో స్కోరు బోర్డులో కదలిక వచ్చింది. దూకుడు మీదున్న క్లాసెన్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. హార్దిక్ వేసిన చివరి ఓవర్లో అనికేత్ రెండు సిక్సులు, కమిన్స్ (8 నాటౌట్) ఒక సిక్స్ బాదడంతో స్కోరు 160 దాటింది.



# దటీజ్ ధోనీ!

చెన్నై: తన కోసం మైదానానికి వచ్చే అభిమానులను నిరుత్సాహపరచకూడదని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ భావిస్తాడు. తన కెప్టెన్సీ, కీపింగ్, బ్యాటింగ్ తో అభిమానులను అలరించేందుకు ప్రయత్నిస్తాడు. మైదానంలోనే కాదు బయట కూడా ఫ్యాన్స్‌ను ఉత్తేజపరచడంలో ముందుంటాడు. ఈ క్రమంలోనే తాజాగా ధోనీ వ్యవహరించిన తీరు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తోంది. భద్రతా సిబ్బందిని ఆపి మరీ తన అభిమానితో ధోనీ సెల్ఫీ దిగడం గమనార్హం. ఆదివారం ముంబయి ఇండియన్స్‌తో ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా చెన్నై జట్టు తలపడనుంది. దాని కోసం ధోనీ ముంబయికి వెళ్తుండగా ఎయిర్పోర్ట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అభిమాని ఒకరు కనిపించారు. ధోనీ కనిపించగానే సెల్ఫీ కావాలని ఆమె ఫోన్ చూపించారు. కట్టుదిట్టమైన సెక్యూరిటీ మధ్య ఉండి కూడా ధోనీ మహిళా అభిమాని ఆకాంక్షను నెరవేర్చాడు. ఆమె దగ్గరకు వెళ్లి స్వయంగా సెల్ఫీ తీసి ఇచ్చాడు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదం

## ఢిల్లీ బౌలింగ్ కోచ్‌కు జరిమానా

ఢిల్లీ: ఐపీఎల్ 2025 సీజన్లో ఉత్కంఠగా జరిగిన సూపర్ ఓవర్ రసవత్తర సమరంలో రాజస్థాన్‌ను ఓడించి ఢిల్లీ అద్భుత విజయాన్ని అందుకున్నప్పటికీ ఆ జట్టుకు ఒక చేదు అనుభవం ఎదురయింది. ఈ మ్యాచ్ సమయంలో ఢిల్లీ బౌలింగ్ కోచ్, మాజీ క్రికెటర్ మునాఫ్ పటేల్, ఫోర్త్ అంపైర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఈ ప్రవర్తనకు గానూ మునాఫ్‌పై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది.



క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినందుకు గానూ ఢిల్లీ బౌలింగ్ కోచ్‌కు జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ (BCCI) ఓ ప్రకటనలో వెల్లడించింది. మ్యాచ్ ఫీజులో 25శాతం కోతతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తున్నట్లు తెలిపింది. దీన్ని లెవల్-1 నేరంగా పరిగణించింది. ఈ ఉల్లంఘనలపై మ్యాచ్ రిఫరీదే తుది నిర్ణయమని చెప్పింది. ఈ జరిమానాకు కారణమేంటో బీసీసీఐ పేర్కొనలేదు కానీ.. అంపైర్తో వాగ్వాదం వల్లే బోర్డు ఈ చర్యలు తీసుకుని ఉండొొచ్చని తెలుస్తోంది. తన తప్పిదాన్ని మునాఫ్ ఒప్పుకొని మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్ని అంగీకరించినట్లు బీసీసీఐ తమ ప్రకటనలో పేర్కొంది.

### ఏం జరిగిందంటే..?

బుధవారం రాత్రి రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ మధ్యలో డ్రింక్స్ బ్రేక్‌లో తమ ఆటగాళ్లకు మెసేజ్ ఇచ్చేందుకు ఢిల్లీ రిజర్వ్ ఆటగాడిని మైదానంలోకి వెళ్లమని మునాఫ్ పటేల్ చెప్పాడు. అయితే అతడిని బౌండరీ లైన్ వద్ద ఉన్న ఫోర్త్ అంపైర్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలోనే అక్కడి అంపైర్‌తో మునాఫ్ వాగ్వాదానికి దిగాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ కారణం వల్లే బీసీసీఐ జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

# ఇంగ్లాండ్ టూర్‌కు ముందే ప్రక్షాళన

## - గంభీర్ బృందంలో ముగ్గురిపై బీసీసీఐ వేటు

ముంబయి: ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్ ఇండియా వెళ్లనుంది. దీనికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. అయినా, జట్టు కోచింగ్ బృందంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్, కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌పై వేటు వేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియాలో జరిగిన గత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని టీమ్ ఇండియా 1-3తేడాతో కోల్పోయిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలోనే భారత్ వైట్‌వాష్‌కు గురయింది. జట్టు పేలవ ప్రదర్శనను కారణంగా చూపిస్తూ బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, భారీ పరాభవాలను తట్టుకొని మరీ టీమ్ ఇండియా చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడంలో గంభీర్ బృందం పాత్ర కీలకమైందే.

కానీ, ఇంగ్లాండ్ తో టెస్టు పర్యటనకు భారీగా కోచింగ్ బృందం అవసరం లేదని బీసీసీఐ భావిస్తోం ది. అందుకోసమే అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌ను పక్కన పెట్టిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టుకు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఉన్నాడు. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇక టెన్ దస్కతే రూపంలో మరో అసిస్టెంట్ కోచ్.. ప్రధాన కోచ్ గంభీర్‌కు సాయంగా ఉన్నాడు. ఈ క్రమంలోనే అభిషేకు తప్పించారు. అయితే, ఆట గాళ్ల ఫీల్డింగ్ మెరుపుల వెనక దిలీప్ ది కీలకపాత్ర అని మాజీలే చెబుతారు. ద్రవిడ్ ప్రధానకోచ్ పదవికి వీడ్కోలు పలికినప్పటికీ.. దిలీప్‌పై నమ్మకంతో బీసీసీఐ అతన్ని కొనసాగించింది. ఇప్పటికైతే ఇంకా వీరి స్థానాలను ఎవరితో భర్తీ చేస్తా రనేది బోర్డు వెల్లడించలేదు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందే కొత్త సపోర్ట్ స్టాఫ్ సిద్ధమవుతుందని క్రికెట్‌వర్గాలు చెబుతున్నాయి.



బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్ విషయాలు బయటకు వెల్లడించాడంటూ ఓ యువ క్రికెటర్ వైపు అందరి వేళ్లూ వచ్చాయి. ఇప్పుడు సహాయక కోచింగ్ బృం దంపై వేటువేయడంతో అసలు ఏం జరుగుతుంద నేది క్రికెట్ అభిమానుల్లో టెన్షన్ నెలకొంది. గంభీర్ సన్నిహితుడిగా పేరొందిన అభిషేక్‌పైనే వేటు పడటంతో భవిష్యత్తులో ప్రధాన కోచ్‌కూ ఇబ్బందులు తప్పవనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

చైతన్య రథం సినిమా
17
శుక్రవారం 18 ఏప్రిల్ 2025

# సిటాడెల్ -2 రద్దు

వరుణ్ ధావన్, సమంత జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ 'సిటడెల్: హనీ-బన్నీ'. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ నటించిన వెబ్ సిరీస్‌కి ఇండియన్ వెర్షన్‌గా ఇది రూపొందిన విషయం తెలిసిందే. దీని పార్ట్ 2 కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా అమెజాన్ ప్రైమ్ వీడియో.. సీజన్ 2 రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రియాంక నటించిన సిటడెల్ ఆధారంగానే ఇండియన్ వెర్షన్, ఇటాలియన్ వెర్షన్లు రూపొందాయి. తాజాగా ఈ రెండింటి కొనసాగింపులను రద్దు చేశారు. బదులుగా వీటిని మాతృకలో విలీనం చేయనున్నారు. ఈ విషయంపై అమెజాన్ ప్రతినిధులు స్పష్టత నిచ్చారు. "సిటడెల్: హనీ-బన్నీ, సిటడెల్: దయానా తదుపరి సీజన్లను నిలిపివేసి.. వాటి కొనసాగింపు కథలను మాతృకలో విలీనం చేస్తున్నాం. ఈ సిరీస్ అన్ని భాషల్లోనూ అద్భుతమైన విజయం సొంతం చేసుకుంది. ఇది ఓ భావోద్వేగ ప్రయాణం.

మాతృకను మరింత గొప్పగా తెరకెక్కించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. ఇక ప్రియాంక నటిస్తోన్న 'సిటడెల్ పార్ట్2' 2026లో విడుదల కానున్నట్లు చెప్పారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో వరుణ్ ధావన్ సీజన్-2 గురించి మాట్లాడుతూ.. మేకర్స్ ఈ సిరీస్ పార్ట్-2ను సినిమాగా తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. దీనిపై చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అయితే తాజాగా అమెజాన్ దీన్ని రద్దు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.



## బ్లో అప్

సిమ్రాన్ చౌదరి



# 'డాన్ 3'లో శార్వరీ

మరి కొద్దిరోజుల్లో 'ఆల్ఫా' సినిమాతో తనలోని యాక్షన్ కోణాన్ని సినీ ప్రియులకు పరిచయం చేయనున్న కథానాయిక శార్వరీ వాఘ్. ఇప్పుడామె మరో భారీ ప్రాజెక్టులో భాగమైనట్లు తెలుస్తోంది. బాలీవుడ్ కథానాయకుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డాన్ 3'. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఫర్హాన్ అక్తర్ రూపొందిస్తున్నారు. రితేశ్ సిధ్వానీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయిక శర్వరీ వాఘ్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం. గతంలో విడుదలై విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న 'డాన్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న చిత్రమిది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే చిత్రీకరణను ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఫర్హాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# 18న థగ్‌లైఫ్‌నుంచి 'జింగుచా'

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'థగ్ లైఫ్' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమాను లెజెండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తుండటంతో వరల్డ్‌వైడ్‌గా మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక సినిమా నుంచి తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. థగ్ లైఫ్ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ 'జింగుచా'ను ఏప్రిల్ 18న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. దీంతో మణిరత్నం, ఏఆర్ రెహమాన్ కాంబోపై మరోసారి భారీ హైప్ క్రియేట్ అయ్యింది. దానికి తగ్గట్టుగానే ఈ ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్ కూడా ఉండటంతో ఈ సాంగ్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక సినిమాలో శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్య లక్ష్మీ, జోజు జార్జ్, అభిరామి, నాజర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాను రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జియాంట్ మూవీస్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



# సైన్స్ ఫిక్షన్‌తో సుదీప్

పాన్ ఇండియా స్థాయిలో 'హనుమాన్' సినిమాని నిర్మించి విజయాన్ని అందుకున్నారు ప్రైమ్ -షో ఎంటర్‌టైన్మెంట్ అధినేతలు కె నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి. ఈ నిర్మాతలు మరో పాన్ ఇండియా చిత్రానికి శ్రీకారం చుట్టారు. ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ కథానాయకుడిగా 'బిఆర్‌బి' (బిల్లా రంగా బాషా) పేరుతో చిత్రం రూపొందుతోంది. ఫస్ట్ బ్లడ్... అనేది ఉపశీర్షిక. అనూప్ బండారి దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించినట్లు సినీ వర్గాలు బుధవారం తెలిపాయి. "సైన్స్ ఫిక్షన్ కథతో రూపొందుతున్న యాక్షన్ చిత్రమిది. 2209 ఏడి నేపథ్యంలో సాగుతుంది. ఓ సరికొత్త అనుభవాన్ని పంచే వినోదం ఇందులో ఉంటుంది. త్వరలోనే సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాల్ని వెల్లడిస్తాం"ని చిత్రవర్గాలు తెలిపాయి.



# స్పిరిట్ తరువాతే ఏదైనా..

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న రెండు సినిమాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఒకటి 'ది రాజాసాబ్' కాగా, మరొకటి హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా. మరో సినిమా 'స్పిరిట్'తో తోపాటు, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కూడా ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయి. ఆయా సినిమాల చిత్రీకరణలు, నిర్మాణానంతర పనుల్లో ఆలస్యం కారణంగా... కథానాయకులు, దర్శకుల ప్రాధాన్యాలు మారుతుంటాయి. ఈ క్రమంలో అనూహ్యంగా కొత్త ప్రాజెక్టులు తెరపైకొస్తుంటాయి. అలా టాలీవుడ్‌లో ప్రస్తుతం పలు కలయికలు ప్రచారంలో ఉన్నాయి. 'స్పిరిట్' ఆలస్యం అవుతుండడంతో కథానాయకుడు ప్రభాస్‌కి సంబంధించి, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చేయనున్న సినిమాల గురించి పలు ఊహాగానాలు ప్రచారంలోకి వస్తున్నాయి. 'స్పిరిట్' స్థానంలో వీళ్లిద్దరూ వేరే ప్రాజెక్టుల్ని పట్టాలెక్కిస్తారనేది వాటి సారాంశం. అయితే ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా ఇద్దరూ కూడా 'స్పిరిట్' పూర్తి చేశాకే ఇతర ప్రాజెక్టులపైన దృష్టిపెట్టనున్నట్టు తెలిసింది. ఇటీవలే ఈ సినిమాకోసం లొకేషన్ల ఎంపికపై కసరత్తులు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుందని తెలిసింది. ఇందులో ప్రభాస్ పోలీస్ అధికారిగా నటించనున్నారు.



# హిట్ కొట్టిన లక్కీభాస్కర్..

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హిట్-3' వేసవి కానుకగా మే1న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను పూర్తి యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాడు. ఇక హిట్ ఫ్రాంచైజీలో ఈ చిత్రం హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. కాగా, సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన మలయాళ రైట్స్‌ను స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫారర్ ఫిలింస్ బ్యానర్ దక్కించుకుంది. దీంతో సినిమాను కేరళలో దుల్కర్ సల్మాన్ గ్రాండ్ రిలీజ్ చేయనున్నాడు. ఇక హిట్ వరుస చిత్రాలకు అక్కడ కూడా క్రేజ్ ఉండటంతో చిత్ర రైట్స్‌ను మంచి ఫ్యాన్సీ రేటుకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నాని పర్ఫార్మెన్స్‌కు అక్కడి ప్రేక్షకులు థ్రిల్ కావడం ఖాయమని చిత్రవర్గాలు చెబుతున్నాయి. అందాల భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించాడు. మరి ఈ సినిమా దుల్కర్ సల్మాన్‌కు ఎంతమేర లక్ తీసుకొస్తుందో చూడాలి.



# 25న సారంగపాణి జాతకం

టాలీవుడ్ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ డైరెక్షన్‌లో ప్రియదర్శి, రూప కొడువాయూర్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన లేటెస్ట్ చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇప్పటికే షూటింగ్ ముగించుకున్న సినిమా రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఏప్రిల్ 25న చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఎంటర్‌టైనింగ్‌గా కట్ చేశారు. ప్రియదర్శి, వెన్నెల కిషోర్, హర్ష చేసే కామెడీతో ఈ ట్రైలర్ పూర్తి ఫన్ రైడ్‌గా సాగింది. జాతకాన్ని నమ్మే హీరోకి ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి.. అతడి ప్రేమకు ఎలాంటి సమస్య ఎదురైంది.. వాటన్నింటిని హీరో ఎలా ఎదుర్కొన్నాడు అనే కాన్సెప్ట్‌తో సినిమాను రూపొందించారు. ఇక ఈ సినిమాలో వెన్నెల కిషోర్, హర్షలతో కలిసి ప్రియదర్శి చేసే కామెడీ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తడం ఖాయమని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందించగా భారీ క్యాస్టింగ్ ఇందులో నటిస్తుంది. శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై ప్రొడ్యూస్ చేస్తున్నారు.

